

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:20 (మంగళవారం సాయంత్రం) సహర్ : 4:42 (బుధవారం ఉదయం)



# టీబీపై పోరు


## రాజమహేంద్రవరంలో అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ టీబీ డేను పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సెమినార్‌లో జేసీ చిన్నరాముడు మాట్లాడారు. టీబీ ఒక అంటువ్యాధి అన్నారు. అనంతరం జిల్లా పరిధిలోని 106 పంచాయతీలకు టీబీ ముక్త్ పంచాయతీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, డాక్టర్ ఏ.మేరీవసంత, డాక్టర్ జి.రత్నాకర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే, జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# తూర్పున..డ్రోన్ నిఘా!



రాజమహేంద్రవరంలో చర్చి వద్ద నిఘా



రాజమహేంద్రవరం పట్టణంపై ఇలా..

అంబేడ్కర్ విగ్రహం ఓకేనా..

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా రాజమహేంద్రవరంతో పాటు కొన్ని ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు గాలిలో తిరుగుతూ అనుమానిత ప్రాంతాల్లో పూర్తిస్థాయి నిఘాపెడుతున్నాయి. బహిరంగ మద్యం తాగడం, గంజాయి సేవించడం ,పేకాట, చైన్ స్నాచింగ్, జూదం వంటి వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలను పోలీస్‌లు వినియోగిస్తున్నారు.

# సీఎం గారూ..కావాలివీ!

## నివేదికలతో అమరావతికి కలెక్టర్ ప్రశాంతి



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- నేడు, రేపు సీఎం కాన్ఫరెన్స్
- 38 డిపార్ట్‌మెంట్లపై నివేదిక
- ప్రధాన సమస్యలపై ఫోకస్

సీఎం చంద్రబాబు ఉంటే అధికారులు ఉరుకులు..పరుగులు పెట్టాల్సిందే మరి.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిందే మరి.. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు 10 నెలల్లోనే రెండు సార్లు ప్రత్యక్షంగా కలిశారు.. జిల్లా అవసరాలపై సమీక్షించారు. మంగళ, బుధవారాల్లో మూడో సారి కలవనున్నారు.ఈ మేరకు జిల్లాలో ముఖ్యమైన 38 ప్రభుత్వ శాఖల పరిధిలో అభివృద్ధి, అవసరాలు, సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం వల్ల పెండింగ్‌లో వివిధ పనుల బిల్లులు వంటివి వాటి వివరాలతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం అమరాతికి బయలుదేరి వెళ్లారు. రాజధాని అమరావతిలో మంగళ, బుధవారాల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో మూడో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. గతంలో సీఎం చంద్రబాబు కలెక్టర్లను అడిగి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, సమీక్షలు చేసేవారు. ప్రస్తుతం జిల్లాకు ఓ ఐఏఎస్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆ అధికారి మొదట జిల్లా కలెక్టర్‌తో సమీక్షిస్తారు. తర్వాత కలెక్టర్ సుమారు 30 నిమిషాల పాటు జిల్లా పరిస్థితిపై వివరించే అవకాశం ఉంది. 15 నిమిషాల పాటు జిల్లాలోని అభివృద్ధి, సంక్షేమం, ఇతర అంశాలపై ప్రజంటేషన్ చేస్తారు. తర్వాత దానిపై 5 నిమిషాల పాటు చర్చ ఉంటుంది. వేసవి కాలం కాబట్టి ప్రధానంగా సాగు, తాగునీటిపై బాగా ఫోకస్ చేసే అవకాశం ఉంది. బురదకాలువ కారణంగా కాపవరం, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, బుచ్చింపేట. మిర్తిపాడు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ఇక్కడ సుమారు 27 ఎకరాల ఆయకట్టు కూడా దెబ్బతింటుందనే విషయాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది. 2023లో బురదకాలువ అభివృద్ధి పనులకు 91.17 కోట్లు మంజూరయ్యాయి. నాడు వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. వాటికి మూడోసారి టెండరు పిలిచి పనులు చేసే అవకాశం ఇవ్వాలని అడగనున్నట్టు సమాచారం. ఎర్రకాలువ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. ఇక జిల్లాలో 38 డిపార్ట్‌మెంట్లకు సంబంధించి సుమారు 600పైగా పేజీల నివేదికలు రావడం గమనార్హం. అందులో సుమారు 8 పేజీల్లో ముఖ్య సమస్యలు, అవసరాలపై ప్రత్యేక నివేదిక తయారు చేసినట్టు తెలిసింది.తొలిరోజు అంటే మంగళవారం మొత్తం 9 జిల్లాల కలెక్టర్లకు అవకాశం లభించనుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలుపెడితే తూర్పుగోదావరి జిల్లా ఏడోది అవుతుంది.అందువల్ల మంగళవారమే కలెక్టర్ ప్రశాంతికి అవకాశం లభించవచ్చు. ఇంకా కొత్తగా రేషన్‌కార్డులు, పింఛన్లు, రోడ్లు, పెండింగ్ బిల్లుల మీద కూడా నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. కలెక్టర్ ప్రశాంతి ప్రజలకు ఉపయోగపడే పలు అంశాలపై కూడా ప్రజంటేషన్ చేసే అవకాశం ఉంది.

# పీజీఆర్ఎస్‌లో 211 అర్జీలు స్వీకరణ



కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు వింటున్న జేసీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య ప్రజల నుంచి 211 అర్జీలను అధికారులు స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. వచ్చిన అర్జీ మళ్లీ తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 29 అర్జీలు స్వీకరించిన ఎస్పీ

పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి వాటికి చట్టపరిధిలో పరిష్కారం చూపించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వివిధ సమస్యలపై 29 ఫిర్యాదులను స్వీకరించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

# పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తా

## పొగాకు కొనుగోళ్ల ప్రారంభంలో ఈడీ విశ్వశ్రీ



దేవరపల్లిలో పొగాకు పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉంటాయని పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ.విశ్వశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేవరపల్లి,గోపాలపురం పొగాకు వేలం కేంద్రాలను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసి తగిన గిట్టుబాటు ధర సాధించుకోవాలన్నారు.ఇతర దేశాల్లో ఏర్పడిన కొరత కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మన పొగాకుకు మంచి డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర లభిస్తుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.తొలిరోజు సోమవారం పొగాకు బోర్డుకు చెరుకుమిల్లి, కాటవరం గ్రామాల నుంచి 27 బేళ్లు వేలానికి పెట్టారు. ఎన్ఎల్ఎస్ పొగాకుకు కిలో రూ.290 ధర పలికింది. ఎన్‌బీఎస్ పొగాకు కిలో రూ.280 ధర పలికింది. పొగాకురైతులు కరుటూరి శ్రీనివాస్, క్రొత్తు వీరవెంకట సత్య నారాయణ,పరిమి శ్రీరామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో రూ.290లు ధర ఇచ్చారని రైతులకు గిట్టుబాటు కాదన్నారు. మహిళా రైతు కరుటూరి ఉషారాణి మాట్లాడుతూ గతేడాది ప్రారంభంలో కేజీ రూ.240..చివరిలో కేజీ రూ. 420 ధర పలికిందని...అలా కాకుండా ప్రారంభం నుంచి చివరి దశ వరకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు.అనంతరం ఈడీని మహిళా రైతులు సత్కరించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే.ప్రసాద్, ఏఎస్ హేమస్మిత, వేలం నిర్వహణాధికారి శ్యామ్ రైతులు సుంకవల్లి శ్రీనివాసరావు, బిక్కిన నాగరాజు, నరహరశెట్టి రాజేంద్రబాబు, యాగంటి సాయిబాబు, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, మాజీ రైతు సంఘం అధ్యక్షుడు మధుమోహన్, పరిమి జగదీష్ పాల్గొన్నారు.

# మామూళ్ల.. మత్తు మందు!

## డ్రగ్స్ అధికారుల ఎడిక్ట్!



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- మామూళ్ల మత్తులో అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 3,500 షాపులు
- ఏడాదికి రూ.6 కోట్లు వసూళ్లు?
- ప్రతి దానికి ఒక రేటు నిర్ణయం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- 'ఆపరేషన్ గరుడ' అంతంతే
- కన్నెత్తి చూడని డ్రగ్స్ యంత్రాంగం
- ఇష్టానుసారం వ్యాపారుల దోపిడీ
- మోసపోతున్న వినియోగదారులు

ఔషధ నియంత్రాధికారులు నిద్దరోతున్నారు.. చుట్టూ దోపిడీ జరుగుతున్నా ఏం తెలియనట్టే వ్యవహరిస్తున్నారు.కళ్లెదుట దోపిడీ సాగుతున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ మనకెందుకొచ్చిందని వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు రూ.5 కోట్లు పైనే మామూళ్ల వసూళ్లు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హడావుడిగా చేసిన తనిఖీలే అందుకు ఉదాహరణ.. 16 షాపుల్లో తనిఖీలు చేసి కేవలం 11 చిన్న కేసులే నమోదు చేశారు. ఉన్నతాధికారులకు తూతూ మంత్రపు నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు.

### మందుల ధరల బాదుడే..

ప్రస్తుతం మనిషికి ఔషధం అనేది నిత్యావసరం. ప్రతి ఇంటిలోనూ నెలకు వచ్చిన ఆదాయంలో సుమారు పది నుంచి 50 శాతం మందులకు ఖర్చు చేస్తున్నారంటే ఏమేరకు అవసరాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా దోపిడీ మాత్రం ఆగడం లేదు. నిత్యావసర మందుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అయినా అడిగేవాడులేడు. పట్టించుకునేవారు అసలే లేరు.. మందులు ఎంత అంటే అంత పెట్టి కొనాల్సిందే. మెడికల్ షాపుల్లో నకిలీ మందులు ఇబ్బడి ముబ్బడిగా ఉంటున్నా ఇటీవల చేసిన తనిఖీల్లో ఒక్కటీ పట్టుకోలేకపోవడం కొసమెరుపు. మరోవైపు మందుల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నా అడిగే నాథుడు లేడు. బీపీకి వాడే ఇస్పిన్ 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కరోనాకు ముందు రూ.28 వరకూ ఉండేది. ప్రస్తుతం రూ.82 తీసుకుంటున్నారు. ఇలా అనేక రకాల మందుల ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. జనరిక్ మెడికల్ షాపుల్లోనూ అధిక ధరలకు అమ్మేస్తున్నా కనీస తనిఖీలు కానరావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ మందులు అమ్మేస్తున్నారు. ఇంకోవైపు మత్తు టాబ్లెట్ల వాడకం పెరిగినట్టు సమాచారం. మొన్న శనివారం చేసిన తనిఖీల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో ట్రమడాల్ ఇంజక్షన్లు ఉండాల్సిన స్టాకుకంటే తక్కువగా ఉండడమే ఉదాహరణ. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు.

### అధికారులేం చేయాలి..

ఉమ్మడి తూర్పుగోదావరి, కొవ్వూరు డివిజన్ పరిధి కలిపి రాజమహేంద్రవరంలోనే డ్రగ్స్ ఏడీ కార్యాలయం ఉంది. దీని పరిధిలో మెడికల్ షాపులు, ఏజెన్సీలు సుమారు 3,500 వరకూ ఉన్నాయి. అవి కాకుండా ఆసుపత్రుల్లో కూడా మెడికల్ షాపులు ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్‌లు చాలా ఉన్నాయి. జిల్లా ఔషధ నియంత్రాధికారి కార్యాలయంలో ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. ఎవరు ఏ మందులు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం అమ్ముతున్నారా అనేది పర్యవేక్షించాలి. కానీ సుమారు రెండేళ్లుగా ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం నుంచి సరైన సమాచారం ఉండడం లేదు. నెలవారీ ఎన్ని శాంపిల్స్ తీశారో.. ఎక్కడ కేసులు పెట్టారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే మామూళ్ల వసూళ్ల చేసుకుంటూ మత్తులో జోగుతున్నారు.. రూ.కోట్లు గడిస్తున్నారు. ప్రజలు మాత్రం పెద్దఎత్తున మోసపోతున్నారు.

### 16 షాపులు.. 11 కేసులు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే కారణంతో ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ గరుడ' పేరుతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్, ఈగల్, పోలీసు తదితర అధికారుల బృందాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16 షాపులపై దాడులు చేశారు. ఈ 16 షాపుల జాబితా ముందే సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో 8, కాకినాడ జిల్లాలో 4, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 దుకాణాలపై దాడులు చేశారు. తనిఖీల్లో పెద్ద కేసు లేమీ పెట్టలేదు. స్టాక్ రికార్డుకు.. స్టాక్‌కు మధ్య తేడా ఉన్నట్టు 11 చోట్ల నమోదు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్నారనే కారణంతో నాలుగు కేసులు నమోదు చేశారు. అనుమానం వల్ల మూడుచోట్ల శాంపిల్స్ తీసుకున్నారు. రెండుచోట్ల ట్రమడాల్ ట్యాబ్‌లెట్లు ఎవరికి విక్రయించారనే దానిపై ఆరా తీశారంతే. కానీ వీటి వివరాలేమీ అధికారికంగా డ్రగ్స్ ఏడీ ఆఫీసు చెప్పకపోవడం గమనార్హం. విజిలెన్స్ అధికారులు మాత్రం వివరాలిచ్చారు. మందుల షాపుల్లో జరుగుతున్న దందా ఏమైందో మరి.



రాజమండ్రిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత (ఫైల్)

### ప్రతీ దానికో రేటు..

ఎవరైనా మెడికల్‌షాపు పెట్టుకోవాలంటే పదో తరగతి చదివితే చాలు. నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలో మందులు అమ్మాలి. డిగ్రీ చదివితే ఒక ఏడాది అనుభవంచాలు. ఎంత పెద్దషాపు పెట్టాలన్నా కేవలం 3 వేలు చలానా కడితే చాలు. లైసెన్స్ ఇవ్వడానికి మామూళ్లు భారీగానే ఇవ్వాలి. ఇక ప్రతి దుకాణం నుంచి ఆరు నెలలకోసారి రూ.5 వేలు వంతున మామూళ్లు ఇవ్వాలి. ప్రతి ఏటా ఇన్‌స్పెక్షన్ పేరిట వస్తే ఒక్కో షాపు కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సిందే. ప్రతి షాపును ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఇది ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. కానీ దుకాణాన్ని బట్టి కనీసం రూ.25 వేల నుంచి మొదలవుతుంది. షాపు షిఫ్టింగ్‌కు రూ.15 వేల వంతున ఇవ్వాలి. ఇదంతా ఆయా ప్రాంతాల యూనియన్ నాయకులే స్వయంగా ఒక గుమస్తాతో వసూలు చేయిస్తారు. నెలకోసారో, వీలైనప్పుడో నేతలు స్వయంగా క్యాష్ బ్యాగ్ తీసుకుని వెళ్లి సదరు అధికారికి సమర్పించుకుంటారు. అక్కడి కొన్ని వాటాలు ఉంటాయి. ఇక్కడ కొందరు యూనియన్ నేతలు కూడా ఇష్టంలేని వారిపై దాడులు చేయిస్తారు. అప్పుడు అధికారులు వీరితో చేతులు కలుపుతారు. ఆరు నెలలకు దుకాణానికి రూ.5 వేల వంతున మొత్తం 3,500 దుకాణాల నుంచి రూ.1.75 కోట్ల మామూళ్లు వస్తాయని అంచనా. ఇన్‌స్పెక్షన్ పేరిట ఏడాదికి వసూలు చేసేది 3,500 దుకాణాల నుంచి రూ.3.50 కోట్లు. రెన్యూవల్‌కు ఐదేళ్లకోసారి రూ.5.25 కోట్లు వసూలు చేస్తారు. ఆకస్మిక తనిఖీలు, తప్పులు దొరికినప్పుడు వసూలు అదనం. ఆరు నెలల కిందట ఒక షాపు వద్ద డ్రగ్స్ దొరకడంతో భారీగా వసూలు చేసినట్టు ప్రచారం ఉంది.

# అయ్యో పాపం.. పది విద్యార్థులు

## రోజూ వందల సంఖ్యలో గైర్హాజరు

## గణితం పరీక్షకు 466 మంది డుమ్మా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అయ్యో ! ఏ కష్టమొచ్చిందో.. ఏ సమస్య దాపరించిందో..ఆ విద్యార్థులు పరీక్షలు రాయడంలేదు. పదవతరగతి పరీక్షలు ప్రతీ విద్యార్థి జీవితంలో కీలకం.ఏమైందో కానీ జిల్లాలో వందలాది మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు గైర్హాజరవుతున్నారు.అయినా వారి గురించి ఆరా తీసే వారే కరువయ్యారు.ఎందుకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయలేపోతున్నారో ఒక్కరూ ఆరా తీయడంలేదు. జిల్లాలో పదవ తరగతి పరీక్షకు 24,379 మంది విద్యార్థులు సిద్ధమయ్యారు. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు ఏకంగా 461 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.ఇక 5వరోజు సోమ వారం జరిగిన మాథ్స్ పరీక్షకు ఏకంగా 466 మంది గైర్హాజరయ్యారు. 2వ రోజు జరిగిన హిందీ పరీక్షకు 377మంది హాజరు కాలేదు. 3వ రోజు జరిగిన ఇంగ్లీషు పరీక్షకు 350 మంది,4వ రోజున జరిగిన సంస్కృతం పరీక్షకు 45 మంది గైర్హాజరయ్యారు.పదో తరగతి పరీక్షలను సాధారణంగా ఎవరూ ఎగ్గొట్టరు. కానీ ఇంతమంది విద్యార్థులు పది పరీక్షలకు ఎందుకు గైర్హాజరవు తున్నారో విద్యాశాఖ దృష్టి సారించాల్సి ఉంది.నూరుశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



కేన్సర్ వైద్య శిబిరం వద్ద ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

# బలభద్రపురంలో కేన్సర్‌పై ఆందోళన వద్దు

## ముగిసిన సర్వే - 38 మందికే కేన్సర్ అనుమానిత లక్షణాలు : కలెక్టర్

అనపర్తి,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బలభద్రపురం గ్రామంలో రెండు రోజుల పాటు ఇంటింటా సర్వే పూర్తి చేసి..38 మంది కేన్సర్ అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.గ్రామంలో వైద్య శిబిరాలను సోమవారం మరోసారి సందర్శించి మాట్లాడారు. 17 మంది వైద్యాధికారులు 98 మంది వైద్య సిబ్బందితో 31 బృందాలు గ్రామంలో రెండు రోజులు జల్లెడ పట్టి 38 మందికి క్యాన్సర్ అనుమానిత లక్షణా లున్నట్టు గుర్తించారన్నారు.స్వతంత్ర హాస్పిటల్, జీఎస్ఎల్ ఆసుపత్రులకు చెందిన కేన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని గ్రామానికి తీసుకువచ్చి సోమవారం మధ్యాహ్నం వరకు పది మందికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించగా ఒక్కరికీ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. గతంలో గ్రామంలో నిర్వహించిన ఇంటింటా సర్వేలో 32 మందికి కేన్సర్ నిర్ధారణ అయినట్టు గుర్తించామని వీరిలో 15 మందికి చికిత్స పూర్తి కాగా మరో 17 మంది చికిత్స పొందుతున్నారన్నారు. వచ్చే మూడు రోజులు గ్రామంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని అనంతరం వచ్చే కేసులను ఆసుపత్రులకు తరలించి పరీక్షలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు గ్రామంలోని ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయిస్తామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు.బలభద్రపురంలో క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు మూల కారణాలను అన్వేషించాలని అపుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు,ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కోఆర్డినేటర్ ప్రియాంక, డాక్టర్ రాజీవ్, ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత్, డాక్టర్ సుజాత, శ్యామల, ఒమీబాబా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డోలా రోసా తదితరులు పాల్గొన్నారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792/2537782, మొబైల్ నెంబర్: 9324517291, ఇ-మెయిల్ ఐడి: ubin0817295@unionbankofindia.bank

APPENDIX-IV-A [See Proviso to Rule 8 (6)]

**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 11.04.2025న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వు ధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

**ఇ-వేలం తేది & సమయం: 11.04.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు**

(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): (1) M/s. కృష్ణ సాయి ఎగ్జిమ్స్, మేనేజింగ్ పార్టనర్: శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, రిజిస్టర్డు ఆఫీస్: డి.నం. 38-4-26, T-1, 4వ అంతస్తు, సత్య సాయి రెసిడెన్సీ, తిలక్ వీధి, కాకినాడ -533 001. (2) శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, తండ్రి: సూర్యనారాయణ శర్మ (లేటు), మేనేజింగ్ పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (3) శ్రీమతి ఐచ్చు అరుణ, భర్త: సత్యనారాయణ, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (4) శ్రీమతి మూలా పద్మావతి భర్త: వికె అన్నపూర్ణేశ్వరరావు, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి, జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (5) శ్రీ అరిగెల సూరరాజు, తండ్రి: లచ్చన్న దొర, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, డి.నెం.18-16-16, మంత్రిప్రగడవారి వీధి, సూర్యనారాయణపురం, కాకినాడ-533001. హామీదారులు:(1) శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, తండ్రి: సూర్యనారాయణ శర్మ (లేటు) మేనేజింగ్ పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ-533002, (2) శ్రీమతి ఐచ్చు అరుణ, భర్త: సత్యనారాయణ, చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (3) శ్రీమతి మూలా పద్మావతి, భర్త: వికె అన్నపూర్ణేశ్వరరావు, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (4) శ్రీ అరిగెల సూరరాజు, తండ్రి: లచ్చన్న దొర, డి.నెం.18-16-16, మంత్రిప్రగడవారి వీధి, సూర్యనారాయణపురం, కాకినాడ-533001, (5) శ్రీ ఐచ్చు సత్యనారాయణ, తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (6). శ్రీ ఐచ్చు నాగరాజు, తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), చిరునామా: డి.నెం. 51-10-2, పూరంవారి స్ట్రీట్, జగన్నాయక్‌పూర్, కాకినాడ-533002, (7). శ్రీ ముమ్మిడివరపు బాలమురళీ కృష్ణ, తండ్రి: వి.వి. సత్యనారాయణ, డి.నెం.81-24-12, శ్రీ వెంకటేశ్వరనగర్, ప్రకాష్ నగర్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా-533106, (8). శ్రీమతి చేకూరి ఉషా దేవి, భర్త: శ్రీరామ మూర్తి, చిరునామా: డి.నెం. 5-123/C, శ్రీ సాయి గణేష్ గార్డెన్స్, వివేకానంద సెంటర్, అచ్చంపేట జంక్షన్, తిమ్మాపురం (పోస్టు), కాకినాడ-533 005. బకాయి మొత్తం: 28.02.2025 నాటికి రూ. 7,82,74,800.88/- (అక్షరాల ఏడు కోట్ల ఎనభై రెండు లక్షల డబ్బై నాలుగు వేల ఎనిమిది వందల రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

**అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ ఆస్తుల వివరములు**

తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి రూరల్ మండలం, ధవళేశ్వరం గ్రామము, కేశవరం రోడ్, పార్టీ శ్రీ రాములు నగర్, బ్లాక్ నెం. 18, ఎన్.సి.నెం. 127/88, నమీన డి.నెం. 4-341/53, ఆర్.ఎస్.నెం. 342/2, ప్లాట్ నెం. 10, మొత్తం 251 చ॥గ॥ విస్తీర్ణంలో రెసిడెన్షియల్ ఖాళీ భూమి ముమ్మిడివరపు బాలమురళీ కృష్ణ పేరున గలదు. హద్దులు: తూర్పు: ఇతరుల భూమి, పశ్చిమం: రోడ్డు, ఉత్తరం: పార్కు స్థలం, దక్షిణం: ప్లాట్ నెం. 11. (సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4171/2004 తేది. 30.12.2004)

**రిజర్వు ధర: రూ. 23,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,35,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 24,000/-**

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింకును దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 15.03.2025, స్థలం: విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



# నవమి.. తెచ్చింది కళ!

- కొబ్బరి రైతులకు కలిసొచ్చిన శ్రీరామనవమి
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా కొబ్బరి ఎగుమతులు
- నిత్యం 75 లారీలకు పైగా కోనసీమకు ఆర్డర్లు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- వెయ్యి కొబ్బరికాయల ధర రూ.14 వేలు

అంబాజీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జనవరి తరువాత కొబ్బరికాయలకు మంచి ధర ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో నుంచి ఆశించిన మేర ఆర్డర్లు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు సన్నగిల్లాయి. ఉగాది, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో రైతులు, వ్యాపారులకు ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఆనందంగా ఉన్నప్పటికీ కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. శ్రీరామ నవమి పండుగను దేశవ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి కోనసీమ వ్యాపారులు, రైతులకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్ ఊపందుకుంది. గతేడాది ఇదే సమయంలో 20 నుంచి 25 లారీల ఎగుమతులు జరగగా, ప్రస్తుతం కోనసీమతోపాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 లారీలకుపైగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సోం, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌తోపాటు ఈ ఏడాది జమ్ముకాశ్మీర్ రాష్ట్రం నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉగాది సందర్భంగా కర్ణాటకలో గుడిపావడా పండుగను వైభవంగా నిర్వహిస్తారు. అక్కడ కొబ్బరికాయలను ఈ పండుగకు ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో ఆ రాష్ట్రానికి కొబ్బరి ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. అలాగే కోల్‌కత్తాలో ప్రతి అమావాస్యకు ఆ ప్రాంత ప్రజలు కొబ్బరిని ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఏడాది శివరాత్రికి భారీగా ఆర్డర్లు వస్తాయని భావించిన రైతులు తమ కల్లాల్లో భారీగా కొబ్బరికాయల నిల్వ చేసుకుని ఉంచారు. అయితే శివరాత్రికి ఆశించినంత మేర ఆర్డర్లు లేకపోవడంతో రైతుల వద్దే కొబ్బరికాయల రాశులు నిలిచిపోయాయి. అయితే పండగలు పూర్తయినప్పటికీ ఎండలు పెరగడం వల్ల కూడా ప్రస్తుతం కొబ్బరి ఎగుమతులు భారీగా జరుగుతున్నాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయలు రూ.14 వేలు పైబడి కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి దిగుబడి తగ్గడం ఇక్కడ ఎగుమతులు ఊపందుకోవడానికి మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా శ్రీరామనవమి ప్రభావం వల్ల ఈ స్థాయిలో ఎగుమతులు మరో నాలుగు రోజులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నవమి మార్కెట్ పూర్తయితే ఎగుమతులు తిరిగి యథాస్థితికి వస్తాయని చెబుతున్నారు.



కాయలను లారీల్లో ఎగుమతి చేస్తున్న కూలీలు

### వేధిస్తున్న కూలీల కొరత...

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడం లేదనే చందంగా మారింది కోనసీమలో కొబ్బరి రైతులు, వ్యాపారుల పరిస్థితి. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ఎగుమతులు ఊపందుకున్నప్పటికీ ఒలుపు కార్మికులు, లోడింగ్ కూలీలు, లారీల కొరత వేధిస్తుండడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్డర్లను సకాలంలో అందించలేకపోతున్నారు. దీనికితోడు లోడింగ్ చేసేవారు, లారీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారులు ఆర్డర్లు వచ్చినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్డర్లను తిరస్కరిస్తున్నారు.





కాకినాడ కలెక్టరేట్‌లో జాబ్‌మేళా కార్యక్రమానికి విచ్చేసిన నిరుద్యోగ అభ్యర్థులు

ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

# ఉద్యోగ మేళాకు.. భారీ స్పందన

- 350 పోస్టులకు గాను 1200మంది హాజరు
- అభ్యర్థులతో కిటకిటలాడిన కాకినాడ కలెక్టరేట్
- ఉభయగోదావరి జిల్లాలతోపాటు గుంటూరు, విజయవాడల నుంచి వచ్చిన నిరుద్యోగులు
- గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సంస్థలో ఉద్యోగాలు
- తొలిరోజు 125మంది ఎంపిక
- నేడు కూడా ఇంటర్వ్యూలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస సంస్థలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి 1200మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రధానంగా కాకినాడ జిల్లా కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం 9గంటలనుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభమైంది. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కంటెంట్ అనలిస్ట్ ఉద్యోగాలకు వాకిన్‌డ్రైవ్ నియామకాలు నిర్వహించారు. తొలిరోజు సోమవారం 1200మంది అభ్యర్థులు హాజరుకాగా 125మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరు వర్క్‌ఫ్రం హోమ్ విధానంలో 8గంటలపాటు పనిచేయాల్సిఉంది. ఇంజినీరింగ్‌తోపాటు నాన్ ఇంజినీరింగ్ గ్రూప్ విద్యార్థులకు కూడా అవకాశం ఇచ్చారు. ఈ సంస్థ సేవలు హైదరాబాద్‌లోను ఉన్నాయి. అక్కడ పనిచేసే అభ్యర్థులకు వసతి సౌకర్యంతోపాటు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు.

### కిక్కిరిసిన కాకినాడ కలెక్టరేట్

ఉదయం 9గంటలకే కాకినాడ కలెక్టరేట్‌లో వికాస కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులతో ఆప్రాంతం కిక్కిరిసింది. అక్కడికి వచ్చిన కొందరికి దరఖాస్తులు ఇవ్వకపోవడం వల్ల అభ్యర్థులు ఎగబడ్డారు.ఈవిషయాన్ని గమనించిన వికాస ఉద్యోగులు తర్వాత అందరికీ దరఖాస్తులు అందేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులతో లోపల ప్రాంగణమంతా నిండిపోయి కోలాహలంగా దర్శనమిచ్చింది. వీరు కూర్చోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు.

### ఆంగ్లంపై పట్టున్నవారికే అవకాశం

ఇంటర్వ్యూల్లో ఆంగ్ల భాషపై, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఉన్నవారికే ఉద్యోగాలు వచ్చాయి. సంస్థ ప్రతినిధులు 12మంది మూడు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళా మంగళవారంకూడా ఉంటుందని, అభ్యర్థులు వివరాలకు 7799376111, 7799376444 నెంబర్లలో సంప్రదించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు.వికాస పీడీ లచ్చారావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ కోసం వేచిఉన్న అభ్యర్థులు

# రూ.87కోట్ల నీటి చార్జీలు చెల్లించండి

- కాకినాడలోని ఏడు పరిశ్రమలకు రెండోసారి నోటీసులు జారీ
- 15రోజుల్లోగా స్పందించకపోతే కఠిన చర్యలు: కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏడు పరిశ్రమలకు రూ.87కోట్లకుపైగా నీటి చార్జీలు చెల్లించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ రెండోసారి నోటీసులు జారీ చేశారు. వీటి నీటి వినియోగ చార్జీలు 2019నుంచి నేటివరకు రూ.87కోట్ల21లక్షల91వేల బకాయి ఉన్నందున వాటిని చెల్లించాల్సిందిగా ఈనెల 7న కలెక్టర్ మొదటిసారి నోటీసులు జారీ చేశారు. ఆయా పరిశ్రమలనుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మళ్లీ సోమవారం నోటీసులు జారీ చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీపోర్టు, జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంపీ శశిధర్ అండ్‌కో, అశోక్ ఎంటర్‌ప్రైజస్, అంజని ఏజెన్సీస్, అన్నపూర్ణ మెరైన్స్‌నుంచి రూ.87కోట్ల 21 లక్షల91వేల నీటి వినియోగ బకాయిలు చెల్లించాలని ఒకసారి నోటీసులుఇచ్చామని, ఆ పరిశ్రమలు స్పందించకపోవడంతో మళ్లీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. దీనిపై 15రోజుల్లోగా స్పందించకపోతే తదుపరి కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# కాకినాడ జిల్లా మెప్మా గిన్నిస్ రికార్డు

- ఆన్‌లైన్ యాప్ ద్వారా లక్ష్యానికి మించి అమ్మకాలు
- మెప్మా పీడీకి కాకినాడ కలెక్టర్ అభినందనలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు వావ్‌జెని ఆన్‌లైన్ యాప్‌ద్వారా లక్ష్యానికి మించి ఉత్పత్తులు విక్రయించినందుకు మెప్మా సంస్థ గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లామెప్మా పీడీ బి.ప్రియంవద కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఒక్కరోజులో లక్షకు పైగా ఉత్పత్తులు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంతో మెప్మా పీడీని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



కాకినాడ జిల్లా మెప్మా పీడీని అభినందిస్తున్న కలెక్టర్

# ఏపీఈఏపీ సెట్‌కు 1,12,606 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు



కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే,మార్చి24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకూ 1,12, 606 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 86,282మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 26,075, రెండింటికీ 249మంది దరఖాస్తుచేసుకున్నారన్నారు. ఈప్రవేశపరీక్షకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని మే19 నుంచి 27వ తేదీవరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఏపీ వ్యాప్తంగా 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 కేంద్రాలు మొత్తం 48కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కె.రాము, ఎస్.సుమతి కోకన్వీనర్లుగానూ, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, రాజశేఖర్, దిలీప్‌కుమార్, ఉషాదేవి, జయప్రసాద్‌లు సభ్యులుగానూ నియామకమయ్యారు విద్యార్థులు https://cets. apsche. ap.gov.in వెబ్‌సైట్‌ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను పూరించాలన్నారు.

- మే 19నుంచి 20వరకూ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలను మే 21నుంచి 27వ తేదీ వరకూ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మే24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకూ, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకూ జరుగుతాయని తెలిపారు.

- ఓసీ విద్యార్థులు రూ.600, బీసీ విద్యార్థులు రూ.550, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.500 చొప్పున ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో మే1, రూ.2000తో మే7, రూ.4000తో మే 12, రూ.10,000 అపరాధ రుసుముతో మే 16వ తేదీవరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచు కున్న విద్యార్థులకు కర్నూలు ప్రాంతీయ కేంద్రంలో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఈఏడాది ఏపీఈఏపీసెట్ దరఖాస్తులో కొత్తగా అపార్ ఐడీ ఆప్షన్ ఇస్తామని ఇది ఆప్షనల్ మాత్రమేనని అపార్ ఐడీ లేకపోయినా పరీక్షకు అనుమతిస్తామన్నారు. కౌన్సెలింగ్ సమయానికి తమ ఇంటర్మీడియట్ కళాశాల ద్వారా అపార్‌ఐడీ పొందాల్సి ఉంటుందని ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హతున్న విద్యార్థులు దరఖాస్తులను పూరించేటప్పుడు నూతన ఆదాయ ధ్రువీకరణపత్రం నెంబర్‌ను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ పొందే విద్యార్థులు కులధ్రువీకరణ పత్రం నెంబర్‌ను నమోదుచేయాలని తెలిపారు.

### ● 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి

విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని వాటిని ప్రాధాన్యతా క్రమంలోఎవరు ముందుగా ఎంపిక చేసుకుంటారో వారికి మొదటి ప్రాధాన్యతా కేంద్రాన్ని కేటాయిస్తామన్నారు. ఈఏపీసెట్‌లో 75శాతం, 10+2 పరీక్షల్లోని గ్రూప్ మార్కుల నుంచి 25శాతం వెయిటేజీతో కలిపి ర్యాంకులు కేటాయిస్తామన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులో ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరిస్తే మే 6నుంచి 8వరకూ సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మే 12నుంచి విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వాటితోపాటూ ర్యాంకు కార్డులను ఈఏ పీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికోసం https://cets. apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలోగానీ helpdeskapeapcet @apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

# నేటి నుంచి ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షలు

● జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కంప్యూటర్ బేసిడ్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ అధికారులు, రెవెన్యూ, ప్రజారవాణా, పోలీస్, వైద్యఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్స్ అసిస్టెంట్ లైబ్రేరియన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, అనలిస్ట్ గ్రేడ్-2, ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల ఉద్యోగుల భర్తీకి సంబంధించి ఈనెల 25నుంచి 27వరకు మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించే కంప్యూటర్ బేసిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షల నిర్వహణకుగాను జిల్లాలో కాకినాడ పట్టణంలో ఎస్. అచ్యుతాపురం వద్ద నున్న అయాన్ డిజిటల్ టెక్నాలజీ, కాకినాడరూరల్‌లోని స్టాప్ టెక్నాలజీ, సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల నేపథ్యంలో ఈమూడు కేంద్రాల పరిధిలోని మండలాల్లో 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. మూడురోజులు రెండుపూటలా ఉదయం, మధ్యాహ్నం జరిగేపరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎండవేడి ఎక్కువగా ఉంటున్నందున వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి అవసరమైన ఓఆర్ఎస్ ఇతర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 8గంటల నుంచి 8.45 వరకు మధ్యాహ్నం 1గంట నుంచి 1.45 నిమిషాల వరకు అనుమతిస్తామన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ప్రశాంత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

## డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా 5వేల క్యూసెక్కులు గోదావరిడెల్టాకు విడుదలవుతుండగా మరో 4వేల క్యూసెక్కులు పైబడి పవర్ జనరేషన్‌ద్వారా విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,468క్యూ సెక్కులుగా నమోదుకాగా ధవళేశ్వరంవద్ద నీటి మట్టం 9.70అడుగులుగా నమోదైంది.

## భావనారాయణస్వామికి రూ. 2,11,500 ఆదాయం

సర్పవరం జంక్షన్, మార్చి24 (ఆంధ్ర జ్యోతి): కాకినాడరూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిస్వామి ఆలయంలో చేపలచెరువు, ఫొటో, వీడియోలు తీసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాటలో రూ2,11,500లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఈవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్వామివారికి చెందిన చేపల చెరువుకి 3నెలల కాలపరిమితికి వేలంపాట నిర్వహించగా, హెచ్చుపాటకు రూ.1,08,000లకు పాడుకున్న వ్యక్తికి వేలంపాట ఖరారు చేశామన్నారు. వివాహాది, శుభకార్యాల ఫొటో, వీడియోలు, వీడియోషూట్‌ల నిర్వహణకోసం లైసెన్స్ హక్కుకోసం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలో రూ.1,03,500 పాడిన వ్యక్తికి టెండర్ ఖరారు చేశామన్నారు.



# సైబర్..ర్..ర్!

- సైబర్ నేరాల్లో పోగొట్టుకుంది రూ.18 కోట్లు
- అధికారులు వెనక్కి తెచ్చింది రూ.8 లక్షలు
- నాలుగేళ్లలో తూర్పున ఇదీ లెక్క
- లబోదిబోమంటున్న బాధితులు

రాజమహేంద్రవరం, మార్చి 24 (ఆంధ్ర జ్యోతి) : సైబర్ క్రైంలో జనాలు పోగొట్టుకున్న సొమ్ము వెనక్కి రావడం అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. గత నాలుగేళ్లలో పోలీస్ రికార్డులు చూస్తే గుండె గుబేల్ మంటుంది. సైబర్ నేరగాళ్ల దోపిడీ చేసింది భారీగా ఉంటే రికవరీ అయ్యి చేతికి వచ్చింది మాత్రం ఆవగింజంత మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో గత నాలుగేళ్ల లెక్కలను పరిశీలిస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

### గత నాలుగేళ్లలో సైబర్ నేరాల గణాంకాలు..

2022లో 114 సైబర్ నేరాలు జరగ్గా రూ. 1,34,43,000లు నష్టపోగా రూ.6,50,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ.1,40,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2023లో 101 సైబర్ నేరాలు జరగ్గా రూ.3,14,19,000లు నష్టపోగా రూ.17,82 ,000లు హోల్డ్‌చేశారు. వాటిలో రూ. 3,09,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2024లో 104 సైబర్‌నేరాలు జరగ్గా రూ. 10,10,51, 000లు నష్టపోగా రూ. 1,62,47,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ. 3,75,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2025లో 25 సైబర్‌నేరాలు జరగ్గా రూ.2,76,40,000లు నష్టపోగా రూ. 7,30,000లు హోల్డ్ చేశారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. జిల్లాలో నమోదైన సైబర్ నేరాల గణాంకాలను పరిశీలిస్తే పోలీసులు అతిస్వల్పంగా కేసులు నమోదు చేసినట్టు తెలుస్తుంది. ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని సైబర్ సెల్‌కి కనీసం 5కు పైగా ఫిర్యాదుదారులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సైబర్ నేరం జరిగిందని ఫిర్యాదుదారుడు పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా కేసులు నమోదు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. తీరా కేసులు నమోదు చేసినా ఆ కేసులు విచారణకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

## మరిడమ్మ హుండీ ఆదాయం రూ4.61లక్షలు

పెద్దాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి తెలిపారు. 97 రోజులు కాలానికి రూ.4,61,845 ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. అన్నదాన హుండీల ద్వారా 129 రోజుల కాలానికి రూ.43,069 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీవారి అధ్యయనోత్సవాలు

● వాడపల్లిలో ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆత్రేయపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలకు ముందుగా స్వామివారి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 29 వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ, సింహ వాహనసేవలు జరుగుతాయి. ఏప్రిల్ 7నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. సోమవారం తిరుమంజన సేవా కాలం నిర్వహించారు. భక్తులకు స్వామి నిజరూప దర్శనం కలిగింది. అశేష భక్తజనం దర్శించుకున్నారు. ఇదిలావుండగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నోము ఆచరించి, అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,95,811 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# గంజాయికి.. గోదారి

## రూటు మార్చిన స్మగ్లర్లు

- ఒడిశా నుంచి వయా పోలిపాక మీదుగా తరలింపు
- పడవరేవును పరిశీలించిన తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

కూనవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల తనిఖీలు ఎక్కువవుతుంటే మరోవైపు స్మగ్లర్లు సైతం తమ రూటును మార్చుకుంటున్నారు. వెళ్లినదారిలోనే వెళితే కిక్కు ఏముంది అనుకుంటున్నారో ఏమో కొత్త మార్గాలు అన్వేషించుకుంటూ తమ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట పోలీసులకు దొరికిపోయి కటకటాల పాలవుతున్నారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయిని తెలంగాణకు తరలించాలంటే సాధారణంగా స్మగ్లర్లు భద్రాచలం మార్గం వైపు తీసుకెళ్తారు. కానీ అక్కడ తనిఖీలు ఎక్కువవుతుండడంతో కూనవరం మండలం పోలిపాక గోదావరి పడవ రేవును ఈసారి ఎంచుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడి నుంచి సుమారు రూ.60.57లక్షలు విలువచేసే గంజాయిని తరలిస్తూ తెలంగాణలోని బూర్గంపాడు పోలీసులకు దొరికిపోయారు. ఈ వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది సూత్రధారులు ఉండగా ఇందులో కూనవరం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు తెలంగాణ పోలీసులు నిర్ధారించారు. వీరిలో పోలిపాక గ్రామానికి చెందిన ఎడముత్యం వంశీతో పాటు గంజాయిని పడవ ద్వారా తరలించిన పడవ యజమాని ఎల్లాజీ కూడా ఉన్నట్టు అక్కడి డీఎస్పీ సతీష్ ఇటీవల జరిగిన అక్కడ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అయితే మండలంలో గంజాయి తరలింపు సంఘటన వెలుగులోకి రావడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ ఎక్సైజ్ అధికారులు మండలంలోని పోలిపాక పడవరేవును సైతం పరిశీలించారు. వాస్తవానికి పోలిపాక పడవరేవు ప్రభుత్వం ఆధీనంలో నడిచేది. పోచవరం కాలనీ పంచాయతీ అధికారులు ఈ పడవరేవు వేలంపాటను నిర్వహించేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో కచ్చులూరు లాంచీ ప్రమాదం జరగడంతో అక్కడి నుంచి పోలిపాక పడవరేవు వేలంపాటను నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ పడవరేవు వేలంపాట నిర్వహించకపోవడంతో ఈ పంచాయతీకి సైతం ఆదాయమార్గం తగ్గిపోయింది. దీంతో కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు ఇక్కడ పడవరాకపోకలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇక్కడ అధికారికంగా పడవరేవు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


పోలిపాక వద్ద రేవును పరిశీలిస్తున్న తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

# ఈత సరే.. గీత దాటొద్దు!

విద్యార్థులు, చిన్నారులకు ఈత కొట్టడం అంటే ఓ సరదా. కానీ అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, జీ.మేడపాడు గ్రామాల వద్ద గోదావరి కాలువ వెంబడి మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ఈతకొడుతూ కనిపించారు. ఇది చూడడానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటుకాడ, గుర్రపుడెక్క ఎక్కువగా ఉండడంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపో లేదు. ఇక్కడే కాదు అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి లేకపోలేదు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారుల మృతి చెందారు. ఇప్పుడు అసలే వేసవికాలం. అందువల్ల తల్లితండ్రులు జాగ్రత్త లు తీసుకుని లోతైన కాలువలు, చెరువుల్లోకి పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)


సామర్లకోట మండలం వేట్లపాలెం గోదావరి కాలువలో ఈతకొడుతున్న చిన్నారులు

### ఆర్థిక లావాదేవీల కారణంగా..

## తమ్ముడిని చంపిన అన్న


మరణించిన సుగ్గిరెడ్డి

మారేడుమిల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీ నీలవరం గ్రామంలో దారుణం జరిగింది. ఆర్థిక లావాదేవీల కారణంగా తమ్ముడిని అన్న విల్లంబులతో హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం సుమారుగా 11 గంటల సమయానికి తంబుడు సుగ్గిరెడ్డి అనే వ్యక్తిని తన అన్న అయిన తుంబుడు లచ్చిరెడ్డి సుగ్గిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు ఎప్పుడు ఇస్తావు అంటూ గొడవ పడి తన వెంట తీసుకువెళ్లిన విల్లంబులతో దాడికి పాల్పడ్డాడు. దీంతో సుగ్గిరెడ్డి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సాదిక్, గుర్తేడు ఎస్ఐ పార్థసారధి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీ స్టేషన్ పరిధి అనపర్తి-బిక్కవోలు రైల్వే ట్రాక్‌పై సోమవారం గుర్తు తెలియని సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ట్రాక్ మెన్ కొండబాబు అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహంపై ఆలీవ్ గ్రీన్ రంగు ప్యాంటు, తెలుపు, కాఫీ రంగు డిజైన్ కలిగిన చొక్కా ఉన్నట్టు పోలీసులు చెప్పారు. గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ జీ.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సోమవారం రాత్రి తెలిపారు.

## గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్న సమయంలో మహిళకు గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన జక్కంశెట్టి విశాలాక్షి (73) ఉపాధి పనులు చేస్తుంది. సోమవారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోగా పక్కన ఉన్న కూలీలు సపర్యలు చేశారు. అప్పటికే ఆమె మృతిచెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకునివెళ్లారు. మృతదేహానికి ఏపీవో అడపా వెంకట శ్రీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్ ఫీల్డ్‌అసిస్టెంట్ గంగాధర్ నివాళులర్పించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కనే జీవిస్తూ అక్కడక్కడే తిరుగుతున్న మతిస్థిమితం లేని మహిళ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద సోమవారం తెల్లవారుజామున ఆ మహిళను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆమె విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి కేసు నమోదు చేశారు. ఈ మహిళ వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కె.చిరంజీవి కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు.


చినలంక వద్ద మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

# చికెన్‌కు వెళ్లి చిరకాల మిత్రులు మృతి

- హైవేపై అతి వేగంగా ఢీకొన్న కారు
- సంఘటనా స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు మరణం


మరణించిన హనుమంతు, సురేష్ (ఫైల్)

పెరవలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా జాతీయ రహదారి అన్నవరప్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా పిట్ల వేమవరానికి చెందిన మాకా సురేష్(26), నేతల హనుమంతు (26) ఇద్దరు చిరకాల మిత్రులు. ఎక్కడికి వెళ్లినా కలిసి మెలిసి తిరిగేవారు. అలాగే కూలీ పనులకు వెళ్తూ తమ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండే వారు. ఈ క్రమంలో వారు సోమవారం ఉదయం చికెన్ కోసం అన్నవరప్పాడు సెంటర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న మారుతీ కారు అతి వేగంగా వచ్చి వారి మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమంతును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి...

# గోదావరిలో దూకి ఆత్మహత్య


చాణక్య (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిని తట్టుకోలేక ఓ వ్యక్తి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన కోడిగుడ్ల వ్యాపారి కలివరపు చాణక్య (36) కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చిన్నతనం నుంచి (బై పోలార్) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం చాణక్య తన యాక్సిస్ బండిపై ఇంటి నుంచి బయటకువచ్చాడు. రోడ్డు కం రైలు బ్రిడ్జిపైకి చేరుకుని తన మొబైల్ వాట్సాప్‌లో మానసిక వ్యాధిని తట్టుకోలేక గోదావరిలో దూకి చనిపోతున్నానని స్టేటస్ పెట్టుకున్నాడు. స్టేటస్‌ను భార్య చూసి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. చాణక్య సోదరుడు సురేష్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ విశ్వం మిస్సింగ్ కేసునమోదు చేశారు. అనంతరం సురేష్ తన భార్య వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్తూ రోడ్డు కం రైలు బ్రిడ్జిపై చాణక్య యాక్సిస్ బండిని చూసి తన అన్నయ్య శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. దీంతో గోదావరి నది లో గాలింపు చర్యలు చేపట్టగా రోడ్డు కం రైలు బ్రిడ్జి దిగువన ఎరినమ్మఘాట్‌లో చాణక్య మృతదేహాన్ని గుర్తించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చాణక్యకు భార్య బేబి సరోజిని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.


మృతదేహం

### పురుగుల మాంసం విక్రయించినందుకు

# సామర్లకోటలో చికెన్ దుకాణం సీజ్



కోడిమాంసం విక్రయించిన చికెన్ దుకాణం

**ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన**

సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పురుగులతో కూడిన నిల్వ ఉన్న కోడిమాంసం విక్రయించిన కాకినాడ జిల్లాలోని సామర్లకోట సంతమార్కెట్ వద్ద ఉన్న సూపర్ చికెన్ సెంటర్ దుకాణాన్ని మూసివేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదేశించారు. ఆదివారం పురుగులతో ఉన్న కోడిమాంసాన్ని విక్రయించినట్టు కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదుల మేరకు ఆంధ్రజ్యోతిలో వాస్తవ కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సామర్లకోట మున్సిపల్ అధికారులను ఆరా తీయడమే కాకుండా సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో నేరుగా కోడిమాంసం విక్రయించిన సంత మార్కెట్ రామాలయం పక్కనే ఉన్న సూపర్ చికెన్ సెంటర్‌కు మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తనిఖీలు నిర్వహించారు. చికెన్ విక్రయాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని, హైజెనిక్ పద్ధతులు పాటించకపోవడాన్ని కమిషనర్ గుర్తించారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ పరిశీలించారు. రోజుకు ఎంత పరిమాణంలో కోడిమాంసం, మేకమాంసం విక్రయాలు సాగిస్తారో తెలుసుకున్నారు. చికెన్ దుకాణంలో పూర్తిస్థాయి హైజెనిక్ పద్ధతులు పాటించిన తర్వాత తమ సిబ్బంది పరిశీలన చేసిన అనంతరం మాత్రమే విక్రయాలు సాగించాలని, అంతవరకూ దుకాణాన్ని మూసివేయాలని ఆమె తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘించి అక్రమంగా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీ గూడుపు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, సిబ్బంది

# భార్య, ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్త అరెస్ట్

అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భార్యతో పాటు ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వివరాల ప్రకారం... ఈ నెల 22న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఉప్పర్ల కాలనీలో నివాసముంటున్న వేముల బాల, ఆమె కుటుంబ సభ్యులపై భర్త అయిన ప్రసాద్ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఇంట్లో అవసరాలు పట్టించుకోకుండా బాధ్యత లేకుండా తాగి తిరుగుతున్నాడని భార్య బాల ప్రశ్నించడంతో పాటు మోటారుసైకిల్ ఈఎంఐల కోసం సొమ్ములివ్వాలని అడిగినందుకు చెక్కబద్దతో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డుపడిన అత్తమామలు, మరదలిని తీవ్రంగా గాయపరిచాడు. ఈ కేసులో వేముల ప్రసాద్‌ను దర్యాప్తు అధికారి అయిన ఎస్ఐ టి.శ్రీనివాస్ అరెస్టుచేసి హత్యాయత్నానికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించినట్టు తెలిపారు.

### రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో

# కోనసీమ కలెక్టరేట్ జట్టు విన్నర్


విజేతగా నిలిచిన కలెక్టరేట్ బృందానికి షీల్డు అందజేసిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కలెక్టరేట్ జట్టు విన్నర్‌గాను, అమలాపురం రెవెన్యూ డివిజన్ బృందం జట్టు రన్నర్‌గాను నిలిచినట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుల పర్యవేక్షణలో జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించినట్టు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్లకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి షీల్డులు అందజేశారు. క్రీడా పోటీలకు వ్యాఖ్యాతగా ఎస్సీ భరత్ వ్యవహరించారు. రెవెన్యూ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని అధిగమించి మానసిక ఉల్లాసాన్ని పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ బృందానికి కెప్టెన్‌గా కిశోర్, అమలాపురం డివిజన్ జట్టుకు కెప్టెన్‌గా శివ వ్యవహరించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిరణ్, బెస్ట్ బౌలర్‌గా కృపాపాల్ నిలిచారు. విన్నర్స్ బృందంలో కిరణ్, శేషు, సుధీర్‌కుమార్, రన్నర్స్ జట్టులో శివ, యాకుబ్, కల్యాణ్‌లు అద్భుత ప్రతిభ చాటారు.

# సత్యదేవుని సన్నిధిలో నీటిని వృథా చేయొద్దు

- పంపా రిజర్వాయర్‌లోకి ఏలేరు నీరు చేరేలా చర్యలు
- పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో కాకినాడ జిల్లా కలెక్టర్ సమీక్ష

అన్నవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీరు వృథా కాకుండా చూడాలని, కనీసం రోజుకు 2లక్షల లీటర్ల నీటిని పొదుపుచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. పోలవరం పనుల కారణంగా పంపా రిజర్వాయర్‌లో నీరు నిల్వలేకపోవడం, ప్రస్తుతం ఎండల కారణంగా ఉన్ననీరు ఆరించిపోవడంతో సత్రం గదుల్లో బస చేసే భక్తులకు నీటిసౌకర్యం కల్పించే విషయంలో ఇబ్బందులు మరోపక్క శ్రీరామనవమి, స్వామివారి దివ్యకల్యాణోత్సవాల్లో చక్రస్నానం కార్యక్రమాల నీటి అవసరాలపై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలేరు నీటిని పోలవరం ప్రాజెక్ట్ పనులకు ఆటంకం కలగకుండా పైప్‌లైన్ వేసేందుకు సుమారు రూ.22లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేసి ఆ నిధులను ఇప్పించాలని కలెక్టర్‌ను కోరడంతో ఆయన అంగీకరించారు. అయితే ఏప్రిల్ 15 నుంచి ఏలేరు రిజర్వాయర్ నీటిని పంపాలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏలేరు నీరు వచ్చే కాలువవెంబడి పంటలు ఉంటే రోజుకు 25 క్యూసెక్కుల చొప్పున నెలరోజులు పంటలు లేకుంటే 50 క్యూసెక్కులు చొప్పున 15 రోజుల పాటు నీటిని అందిస్తే వేసవి నుంచి భక్తులు గట్టెక్కించవచ్చని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలపడంతో ఆవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీటినిల్వలు భక్తుల అవసరాలకు పొదుపుగా వాడుకుంటే నెలరోజులకు సరిపోతాయని ఇరిగేషన్ ఈఈ తెలిపారు. సమావేశంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ నూకరత్నం, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజు మేరీమాత మహోత్సవాలు


నిర్మలగిరిలో ప్రార్థనలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో గౌరీపట్నం మేరీమాత మహోత్సవాలకు మూడో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు దివ్య బలిపూజలు చేశారు. ఆయన ప్రసంగిస్తూ సకల మానవాళి సుఖశాంతులతో జీవించాలని, అందరూ దైవచింతన కలిగి ఉండాలన్నారు. ఉదయం రెవరెండ్ ఫాదర్ దానియేలు, మేత్రాసన నూతన గురువులు మరియజోజి, బాలరాజు, సాగర్, దివ్య బలి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సువార్త కమిటీ గాబ్రియేలు సువార్త ప్రచారం నిర్వహించారు. గొరంట్ల జ్వానేస్, బాబుజార్జి, టీ.ఇమ్మానియేలు, కే.రాయప్ప, పరిశుద్ధ జపమాల, దివ్య బలి పూజలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్మల స్కూల్ బాల బాలి కలతో నృత్యప్రదర్శన, కే.జ్ఞానానందం సంగీ తకచేరి, ఏసుమహిమ నాటకాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


విద్యుత్ కాంతుల్లో జీసెస్ టవర్

## జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలో జరిగిన తల్లీకూతురి హత్య కేసులో నిందితుడు పల్లి శివకుమార్‌ను అరెస్టు చేసినట్టు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో లైట్ మెన్‌గా పనిచేస్తూ పరిచయమైన శ్రీకాకుళం జిల్లా కొత్తవీధి నందిగామ మండలానికి చెందిన శివకుమార్, సుమ్యా ప్రేమించుకున్నారు. తండ్రి మరణించడంతో తల్లి సాల్మాతో కలిసి రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలోకి 3నెలల క్రితం సుమ్యా వచ్చి ఇక్కడే ఉంటోంది. కొంతకాలంగా శివకుమార్ వచ్చి వెళ్తున్నాడు. ఇటీవల సుమ్యా వేరొకరితో ఫోన్లో మాట్లాడడాన్ని గమనించిన శివకుమార్ నామవరం వచ్చి ఆదివారం రాత్రి తల్లి సాల్మాను నిలదీశాడు. సుమ్యాను సాల్మానే ప్రోత్సహిస్తుందని ఆమెతో గొడవపడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున ఫోను మాట్లాడేందుకు సుమ్యా మేడపైకి వెళ్లిన సమయంలో వారి వంట గదిలో ఉన్న కత్తిని తీసుకుని మంచంపై పడుకున్న సాల్మా గొంతుకోసి ఆటుపై తలుపు పక్కనే వేచి ఉంచి సుమ్యా లోపలికి వచ్చే క్రమంలో ఆమెపై దాడి చేసి హత్య చేశాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. కొవ్వూరు రూరల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. సోమవారం నిందితుడిని కొవ్వూరు నుంచి తీసుకువచ్చి అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో పక్క సాల్మా, సుమ్యా మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

## బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరికి 11నెలలు జైలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు 11నెలల జైలు శిక్ష విధిస్తూ ఐదో అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి తీర్పునిచ్చారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సారంగధర మెట్టకు చెందిన కోసూరి వెంకటరమణ, సుబ్బారావు నగర్‌కు చెందిన ఎంపల్లి లక్ష్మణరావు 2024లో రాజమహేంద్రవరంలో దహించు అగ్ని ప్రార్థనా మందిరం వద్ద బైక్‌లను దొంగించారని బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి త్రీటౌన్ ఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. ప్రాసెక్యూషన్ తరఫున అసిస్టెంట్ ఏపీపీ బీవీ మోహనరావు వాదించారు. ఈ కేసులో ట్రైల్ ప్రాసెస్‌కి ఎప్పటికప్పుడు మోనిటర్ చేసిన ప్రస్తుత త్రీటౌన్ సీఐ వి.అప్పారావును, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వెంకటేశ్వరావులను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.


## బీజేపీ నేతపై కర్రతో దాడి

రౌతులపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మండల బీజేపీ నేత యాదగిరి వెంకటరమణ(శ్రీను)పై అదే గ్రామానికి చెందిన గాలి అప్పారావు దాడి చేశాడు. సోమవారం శ్రీను తన ఇంటి వద్ద నుంచి శివాలయానికి బైక్‌పై వెళ్తుండగా అప్పారావు కర్రతో దాడి చేశాడు. గతంలో రహదారికి అడ్డంగా ఇసుక, కంకర పోశావు, పక్కకు తొలగించని ప్రశ్నించినందుకు దాడి చేశాడని, అప్పారావు వల్ల తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నాడు.

# ఎండ మండే.. మబ్బు హాయే..

ఎండలు మండిపోతున్నప్పుడు మబ్బు పడితే ఎంతో హాయిగా ఉంటుంది కదా.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఇదే జరిగింది. ఆ దశ్యాలే ఇవి.



- ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



# శ్మశాన వాటికకు దారి కల్పించండి


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

రైతు కూలీ సంఘం నాయకుల ధర్నా

రంగంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈలకొలను పంచాయితీ పరిధిలోని అచ్యుతాపురంలో కొత్తపేట దళిత, ఇతర పేదల శ్మశాన వాటికలకు దారి కల్పించాలని ఏపీ రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో పేదల శ్మశాన వాటికలకు దారి కల్పించాలని, ఎస్టీ రాజాపురంలో అన్యాక్రాంతమైన పత్తి వెంకన్న భూమి సమస్య పరిష్కారం కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంతో ఆం దోళనకారులు ఆగ్రహించి నినాదాలు చేస్తూ కార్యాలయం లోపలికి వెళ్లి తహశీల్దార్ కోసు అనసూయకు వినతిపత్రం అందించామన్నారు. సర్వేకు ఆమె హామీ ఇవ్వడంతో ధర్నా ను విరమించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కొత్తపేట నుంచి బొట్టుగొయ్యి రోడ్డును కలిపే మార్గానికి ప్రైవేటు వ్యక్తులు కం చె వేయడంతో 100 కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్గాన్ని పు నరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంచె అంజిబాబు, మడికి సత్యం, డొక్కులూరి సంగీత, బొచ్చ యేసు, డి.సురేష్, తానంకి అంకుశం, పీత ప్రసాద్ పాల్గొన్నారు.

# పది గణితం పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

బిక్కవోలు ఎంఈవో సత్యనారాయణ

బిక్కవోలు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయినట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బలభద్రపురం సెంటర్‌లో ఇద్దరు, పందలపాక సెంటర్‌లో ఐదుగురు హాజరు కాలేదని వివరించారు.

### రాజానగరంలో ఆరుగురు గైర్హాజరు..

రాజానగరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఏడు పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 1184 మంది విద్యార్థులకుగానూ సోమవారం నాటి గణితం పరీక్షకు ఆరుగురు గైర్హాజర య్యారు. మండలంలోని సంపత్‌నగరం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో నలుగురు, రాజానగరం హైస్కూల్లో ఒకరు, దివాన్‌చెరువు హైస్కూల్లో ఒకరు, గణితం పరీక్షకు గైర్హాజరైనట్టు ఎంఈవోలు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు.

### రంగంపేటలో ఒకరు గైర్హాజరు..

రంగంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి హైస్కూల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గణిత శాస్త్ర పరీక్షలకు 578 మంది విద్యార్థులకు గాను 574 మంది హాజరైనట్టు ఎంఈవో పి.మధుసూదనరావు తెలిపారు. రంగంపేటలో 208 మందికి 207 మంది, వడిశలేరులో 186 మందికి 184 మంది, సింగంపల్లి హైస్కూల్లో 184 మందికి 183 మంది పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు.

# డాక్టర్ చైతన్యకు విశిష్ట సేవా పురస్కారం


ప్రశంసాపత్రం అందుకుంటున్న చైతన్య

సీతానగరం, మార్చి 24: డాక్టర్ చైతన్య జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. సోమవారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినం కార్యక్రమంలో ఈ ప్రశంస అందుకున్నారు. టీబీ ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో క్షయ వ్యాధి నిర్మూలనకు విశిష్ట సేవలందించినందుకు సీతానగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ చైతన్య ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎంఎల్‌హెచ్‌పీ జి.బేబి స్వరూప ఈ ప్రశంసాపత్రము అందుకున్నారు. ఈ సందర్భంగా అదపు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారిణి జిల్లా టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజానగరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కు లను జనసేన పార్టీ నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధిత కుటుంబాలకు సోమవారం అందజేశారు. మండలంలో 13 మంది లబ్ధిదారులకు రూ.13,52,250 విలువైన నగదు చెక్కులను వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ‘దూబచర్ల’ నిందితులను కఠినంగా శిక్షించాలి

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుమన్‌బాబు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం దూబచర్లలోని గాంధీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో అన్ని కులాలు అంబేద్కర్‌ను ఆరాధిస్తున్నాయని ఇటువంటి తరుణంలో చెప్పుల దండ విగ్రహం మెడలో వేసి అవమానకరంగా ప్రవర్తించిన వారిని పట్టుకుని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. విగ్రహాల జోలికి వస్తే తీవ్రపరిణామాలు ఉండేలా చట్టాలను సవరించాలన్నారు.

# పెన్షనర్ల భవన అభివృద్ధికి విరాళాల అందజేత

ధవళేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం రాత్రి అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలపై చర్చించడంతో పాటు భవన అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. ఈ సమావేశంలో భవన అభివృద్ధికి రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్ నల్లి విజయ్‌మోహన్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఐవీ సుబ్బారావు రూ.10,116లు చొప్పున విరాళాన్ని అసోసియేట్ ప్రెసిడెంట్ యర్రమోతు ధర్మరాజుకు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్లు దువ్వూరి కామేశ్వర శర్మ, కొండా సూర్యనారాయణ, అరవ సత్యనారాయణ, కె. వెంకటరత్నం, వీవీ వెంకటేశ్వర్లు, వి. మహాలక్ష్మిరావు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రుణాలకు గడువు పెంపు

రాజానగరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బీసీ, కాపు, ఈబీసీ రుణాల ఆన్‌లైన్ దరఖాస్తుల గడువుతో పాటు వయోపరిమితిని పెంపు చేసినట్టు ఎండీపీవో జేఏ ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి స్వయం ఉపాధి యూనిట్లు, జనరిక్ మెడికల్ షాపులు, మేదర/కుమ్మరి శాలివాహన యూనిట్లకు ప్రభుత్వ సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాల కోసం ఆన్‌లైన్‌లో తొలుత ఈ నెల 22తో గడువు ముగిసిందన్నారు. అయితే ప్రభుత్వం దీనిని ఈ నెల 25 వరకు, అలాగే గతంలో ఉన్న లబ్ధిదారుల 50ఏళ్ల వయస్సును 60 ఏళ్లకు పెంపు చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. మండలంలోని ఆసక్తి కలిగిన, అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకుని, కార్పొరేషన్ రుణాలకు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

దివాన్‌చెరువు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని దివాన్‌చెరువులోని వీజే కళాశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీ జగన్మోహనరెడ్డి అన్నారు. వారం రోజులుగా కళాశాలలో నిర్వహించిన ఇంట్రా కళాశాల క్రీడా పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డి.నరేంద్ర మాట్లాడుతూ చదువుతో బాటు క్రీడారంగంలో తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ ఎస్.శకుంతల అధ్యాపకులు పాల్గొన్నారు.

# 26న సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) :ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, కాలనీల్లోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26వ తేదీన రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తెలిపారు. ఆయా సమస్యలపై ప్రభుత్వానికి దరఖాస్తులు అందజేసేందుకు ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ అర్హులైన పేదలు అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పవన్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ‘బీజేపీ మతోన్మాద రాజకీయాలను తరిమికొట్టాలి’

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మతోన్మాద రాజకీయాలను దేశం నుంచి తరిమికొడదాం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో ఎన్డీఏ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతం పేరుతో ప్రజలను విడదీసే కుట్రలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాల వల్ల లౌకిక, ప్రజాతంత్రవాదానికి పెనుప్రమాదం పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ సీపీఐ ప్రచార జాత ఏప్రిల 14న ముగుస్తుందని, ముందుగా 9న భీమోలులో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అలాగే మే 15వ తేదీ వరకూ శాఖ మహాసభలు నిర్వహించి, జులై చివరి వారంలో రాజమహేంద్రవరంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తామని మధు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధే కూటమి ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

» ప్రతిఒక్కరి సొంతింటి కల సాకారానికి కృషి
» కడియం మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. స్వయం ఉపాధి పథకం కింద రుణాలు అందించి వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. జూన్ మొదటి వారంలో తల్లికి వందనం పథకం ఇస్తామన్నారు. కడియంలో ఉన్న చిన్నపాటి ఇబ్బందులు తొలగిన వెంటనే ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చి పేదల సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. రాబోవు వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దుళ్ల ఎర్ర కాలనీలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి అడ్డంకులు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు గిరజాల బాబు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్చిన హామీని నెరవేర్చి ప్రజలకు విద్యుత్ కష్టాలు లేకుండా చూడాలన్నారు. కడియంలో బొబ్బిలి వంతెనను పునఃనిర్మించాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. దామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ ముద్రగడ జమీ మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, యాదల స్టాలిన్, కొండపల్లి పట్టియ్య, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఎంపీటీసీలు నాగిరెడ్డి రామకృష్ణ, ఉపసర్పంచ్‌లు వెలుగుబంటి నాని, పాతూరి రాజేష్ పాల్గొన్నారు. అంతకుముందు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను ఎమ్మెల్యే గోరంట్ల తిలకించారు. విజేతలైన దూడలకు చెందిన రైతులకు బహుమతులు అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రంగంపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. వడిశలేరు, ముకుందవరం గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్టు చెప్పారు.

## ఆర్థిక బకాయిలు పూర్తిగా విడుదల చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయులుకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయ త్రినాథబాబు కోరారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు దాదాపు రూ.30 వేల కోట్లు బకాయి ఉండగా రూ.6200 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగిలిన బకాయిలను తక్షణం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో చేపట్టనున్న పదోన్నతులు, బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగేలా చూడాలని త్రినాథబాబు అన్నారు.

# కార్మికుల సమస్యలపై పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధరరావు

» ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24( ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన వాసంశెట్టి గంగాధరరావు అన్నారు. స్థానిక కంబాలచెరువు వద్ద తన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితం ఐఎన్‌టీయూసీ నుంచే ప్రారంభించానన్నారు. రవాణా శాఖకు సంబంధించి ఫిట్‌నెస్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఐఎన్‌టీయూసీ ఉభయ తెలుగు రాష్ట్రాల సంయుక్త కర్యాదర్శి నారాయణరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా గెయిల్, ఓఎన్‌జీసీ, వేదాంతు, కెయిన్ ఎనర్జీ వంటి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ఇతర రాయితీలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో లోడా అప్పారావు, కోస్టర్ పేపరు వర్కర్స్, ఓఎన్‌జీసీ పెట్రోలియం ఎంప్లాయిస్ యూనియన్, క్వారీ లారీ యూనియన్, రాజమండ్రి ఆటో వర్కర్స్, గోదావరి ట్రాన్స్‌పోర్టు, నేషనల్ మోటరు వర్కర్స్ యూనియన్, ఈనోసాల్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన పీఎం అజయ్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన విచ్చేసి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 14మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.26లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థిక ఎదుగుదల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీలేని రాయితీతో కూ డిన రుణాలు అందజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, కర్రి బులిరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఆదరణ-3పై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఆదరణ-3 పథకంపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పేరుతో వివిధ కులవృత్తుల వారికి అనేక రకాలైన పనిముట్లను అందించాయని వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని తుంగలో తొక్కిందని, లబ్ధిదారులకు అందాల్సిన పనిముట్లను గోదాములకే పరిమితం చేసి తుప్పు పట్టి పాడైపోయేలా చేసిందని, కుట్టు మిషన్లు, సైకిళ్లతో పాటు అనేక రకాలైన పనిముట్లు, కంప్యూటర్లు సైతం నాశనం చేశారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, మత్యేటి శివసత్యప్రసాద్, మార్ని వాసుదేవరావు, పెండ్యాల రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, కామిని భాస్కరరావు, గాలి వెంకటేశ్వరరావు, పండూరి అప్పారావు, పిన్నంటి ఏకబాబు, యానాపు ఏసు, బోగవల్లి రామారావు, ఎంఎస్ఆర్ శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి


పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన వీసీ ప్రసన్నశ్రీ

‘నన్నయ’ వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు పాటిస్తూ ఎటువంటి సమస్య తలెత్తకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలల్లో సోమవారం నుంచి బీఈడీ, డిగ్రీ, న్యాయవాద విద్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ఏకేసీ డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కళాశాల, రాజీవ్‌గాంధీ డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను వీసీ సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కళాశాలల యాజమాన్యాలకు సూచించామన్నారు. పరీక్షల సమయంలో సిబ్బంది, అధికార్లు అప్రమత్తంగా ఉండాలని, కేంద్రాలలో ఎటువంటి సమస్య తలెత్తకుండా నిర్వహించాలని చెప్పినట్టు పేర్కొన్నారు.

# వైసీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రి సర్వనాశనం

» గాడిలో పెట్టేందుకు ఎనిమిది నెలల సమయం పట్టింది
» మీడియాతో ఎమ్మెల్యే వాసు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిని సర్వనాశనం చేశారని, రోగుల ఇబ్బందులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ చేసిన తప్పులను, అవినీతి వ్యవహారాలను సరిచేసి పాలన గాడిలో పెట్టడానికి దాదాపు 8నెలల సమయం పట్టిందన్నారు. రాబోయే రోజుల్లో ఆసుపత్రిని పూర్తి ప్రక్షాళన చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తామని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కొరతను అధిగమించేందుకు, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను రోగులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఐఎంఏ సహకారం తీసుకుంటున్నామన్నారు. మార్చురీలో శవాలపైనా డబ్బులు గుంజుతున్న వారందరినీ ఏరిపారేస్తున్నామని, ఎవరైనా అవినీతికి పాల్పడితే ఇలాంటి చర్యలే ఉంటాయన్నారు. మార్చురీకి అందజేసిన ఫ్రీజర్లను రోటరీక్లబ్ నిర్వహిస్తోందని, ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశామని, పేపర్‌మిల్లు ద్వారా మరో రూ.50 లక్షలు మంజూరు చేయించామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు ఎంసీహెచ్ బ్లాకులో ఫైబ్రో లివర్ స్కానింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణేశ్వరరావు, కడలి రామకృష్ణ, రవియాదవ్, రాచపల్లి ప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక 2వ డివిజన్‌లో రామాలయం వద్ద డ్రైనేజీలో పేరుకుపోతున్న చెత్తచెదారం వల్ల ఇబ్బందులు ఎదురౌతున్నాయని, మురుగునీరు ఒక్కోసారి రోడ్డుపైకి వస్తుందని స్థానికులు ఎమ్మెల్యే వాసు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి సోమవారం డివిజన్‌లో పర్యటించారు. ఈ డ్రైనేజీ వద్ద ఒక గ్రిల్ ఏర్పాటు చేసి అక్కడ అడ్డుపడిన చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్కడికి వచ్చిన కొంతమంది మహిళలు అర్హులైన తమకు ప్రభుత్వ ఇళ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, సలాది ఆనంద్, దొంగ నాగమణి, ఆడారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం

మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్
పీజీఆర్ఎస్‌కు 32 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీపై విచారణ జరిపి నాణ్యమైన పరిష్కారాలు చూపిస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆయన ప్రజల నుంచి 32 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం, మౌలిక సదుపాయల కల్పన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

### మెప్మా సిబ్బందికి అభినందన

ఇదిలా ఉండగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు ఒక్కరోజులో లక్షకు పైగా ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయించినందుకు మెప్మా సంస్థకు గిన్నిస్ రికార్డులో స్థానం దక్కింది. ఈ సందర్భంగా మెప్మా సిబ్బంది సోమవారం కమిషనర్‌ను కలిసారు. వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 4200 ఉత్పత్తులు విక్రయించామన్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను లక్ష్యానికి మించి కొనుగోలు చేశారన్నారు. వావ్ గెని యాప్ ద్వారా లక్షకు పైగా ఉత్పత్తులను విక్రమించినందుకు మెప్మా సంస్థకు ఈ గౌరవం దక్కిందన్నారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బందికి సర్టిఫికెట్‌లను కమిషనర్ అందజేశారు. కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, కార్పొరేషన్ సెక్రటరీ శైలజావల్లి, సీఎంఎం రామలక్ష్మి పాల్గొన్నారు.

## నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

నిడదవోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి పంచా యతన క్షేత్రంలో మంగళవారం నుంచి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణా ధికారి సోమాల శివ, ప్రధాన అర్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి తెలిపారు. విశేష పూజలతో ప్రారంభించి స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం, 26న రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, గ్రామోత్సవం, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణాలు, 27న స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, 28న మాసశివరాత్రి విశేష అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, 29న వసంతోత్సవం, పుష్ప యాగోత్సవం, పవళింపు సేవ నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

## లక్ష తులసీ పూజ

పెరవలి, మార్చి24(ఆంధ్రజ్యోతి): కాకరపర్రులో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో సోమవారం లక్ష తులసీ దళ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు గావించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పెన్మత్సన సుబ్రహ్మణ్యవర్మ కుటుంబసభ్యులు ఈ సందర్భంగా హోమాలు, పూజలు చేశారురు.

## ఉమా పార్వతీశానికి నిక్షయ మిత్ర అవార్డు

కోరుకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న యు. ఉమాపార్వతీశం క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో విశేషసేవలు అందించినందుకు రాజమహేంద్రవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్‌వో చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజిలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులు బహూకరించాఉ. కోరుకొండ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో క్షయవ్యాధి ఉన్న నిరుపేద వ్యాధిగ్రస్తులకు నిక్షయ మిత్ర పౌష్టికాహార ఫుడ్‌ప్యాకెట్లు పంపిణీ చేసినందుకు ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్‌వో, అడిషనల్ డీఎంహెచ్‌వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా పార్వతీశంను పలువురు అభినందించారు.

## ఓలేటికి ఘన సత్కారం

కోరుకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం పి.గన్నవరంలో జరిగిన మెగా ఆర్యవైశ్య సదస్సులో కోరుకొండకు చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఓలేటి సూర్యనారాయణ మూర్తిని ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు ఘనంగా సత్కరించారు. ఓలేటి సూర్యనారాయణ మూర్తి గతంలో కోరుకొండ మండలానికి చెందిన వాసవి క్లబ్ అధ్యక్షుడిగాను, ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘంలోను ఉపాధ్యక్షుడిగా చురుకైన పాత్ర పోషిస్తున్నారు కార్యక్రమంలో శ్రీకాకుళంపు శివరామసుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు ప్రగల పాటి కనకరాజు పరిచయ వేదిక చైర్మన్ గ్రంధి రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## గజ్జరం డీసీఎం హాస్టల్ తనిఖీ

తాళ్లపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గజ్జరంలోని డీసీఎం హాస్టల్‌ను ఆర్డీవో రాణీ సుస్మిత సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కల్పించే వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి, ఆర్ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, హాస్టల్ నిర్వాహ కులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ : 6 : 20 (మంగళవారం సాయంత్రం)
సహర్ : 4:42 (బుధవారం ఉదయం)


రాజమహేంద్రవరంలో చర్చి వద్ద నిఘా

## టీబీపై పోరు
### రాజమహేంద్రవరంలో అవగాహన ర్యాలీ








రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను టీబీ రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్రపంచ టీబీ డేను పురస్కరించుకుని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సెమినార్‌లో జేసీ చిన్నరాముడు మాట్లాడారు. టీబీ ఒక అంటువ్యాధి అన్నారు. అనంతరం జిల్లా పరిధిలోని 106 పంచాయతీలకు టీబీ ముక్త్ పంచాయతీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, డాక్టర్ ఏ.మేరీవసంత, డాక్టర్ జి.రత్నాకర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తూర్పున..డ్రోన్ నిఘా!

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా రాజమహేంద్రవరంతో పాటు కొన్ని ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు గాలిలో తిరుగుతూ అనుమానిత ప్రాంతాల్లో పూర్తిస్థాయి నిఘాపెడుతున్నాయి. బహిరంగ మద్యం తాగడం, గంజాయి సేవించడం ,పేకాట, చైన్ స్నాచింగ్, జూదం వంటి వాటిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలను పోలీస్‌లు వినియోగిస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఓకేనా..


రాజమహేంద్రవరం పట్టణంపై ఇలా..

## సీఎం గారూ..కావాలివీ!
### నివేదికలతో అమరావతికి కలెక్టర్ ప్రశాంతి

- నేడు, రేపు సీఎం కాన్ఫరెన్స్
- 38 డిపార్ట్‌మెంట్లపై నివేదిక
- ప్రధాన సమస్యలపై ఫోకస్



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సీఎం చంద్రబాబు ఉంటే అధికారులు ఉరుకులు..పరుగులు పెట్టాల్సిందే మరి.. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిందే మరి.. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు 10 నెలల్లోనే రెండుసార్లు ప్రత్యక్షంగా కలిశారు.. జిల్లా అవసరాలపై సమీక్షించారు. మంగళ, బుధవారాల్లో మూడో సారి కలవనున్నారు.ఈ మేరకు జిల్లాలో ముఖ్యమైన 38 ప్రభుత్వ శాఖల పరిధిలో అభివృద్ధి, అవసరాలు, సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వం వల్ల పెండింగ్‌లో వివిధ పనుల బిల్లులు వంటివి వాటి వివరాలతో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం అమరాతికి బయలుదేరి వెళ్లారు. రాజధాని అమరావతిలో మంగళ, బుధవారాల్లో సీఎం నారా చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో మూడో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. గతంలో సీఎం చంద్రబాబు కలెక్టర్లను అడిగి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, సమీక్షలు చేసేవారు. ప్రస్తుతం జిల్లాకు ఓ ఐఏఎస్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆ అధికారి మొదట జిల్లా కలెక్టర్‌తో సమీక్షిస్తారు. తర్వాత కలెక్టర్ సుమారు 30 నిమిషాల పాటు జిల్లా పరిస్థితిపై వివరించే అవకాశం ఉంది. 15 నిమిషాల పాటు జిల్లాలోని అభివృద్ధి, సంక్షేమం, ఇతర అంశాలపై ప్రజంటేషన్ చేస్తారు. తర్వాత దానిపై 5 నిమిషాల పాటు చర్చ ఉంటుంది. వేసవి కాలం కాబట్టి ప్రధానంగా సాగు, తాగునీటిపై బాగా ఫోకస్ చేసే అవకాశం ఉంది. బురదకాలువ కారణంగా కాపవరం, బూరుగుపూడి, శ్రీరంగపట్నం, బుచ్చింపేట. మిర్తిపాడు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ఇక్కడ సుమారు 27 ఎకరాల ఆయకట్టు కూడా దెబ్బతింటుందనే విషయాన్ని ప్రస్తావించే అవకాశం ఉంది. 2023లో బురదకాలువ అభివృద్ధి పనులకు 91.17 కోట్లు మంజూరయ్యాయి. నాడు వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. వాటికి మూడోసారి టెండరు పిలిచి పనులు చేసే అవకాశం ఇవ్వాలని అడగనున్నట్టు సమాచారం. ఎర్రకాలువ సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. ఇక జిల్లాలో 38 డిపార్ట్‌మెంట్లకు సంబంధించి సుమారు 600పైగా పేజీల నివేదికలు రావడం గమనార్హం. అందులో సుమారు 8 పేజీల్లో ముఖ్య సమస్యలు, అవసరాలపై ప్రత్యేక నివేదిక తయారు చేసినట్టు తెలిసింది.తొలిరోజు అంటే మంగళవారం మొత్తం 9 జిల్లాల కలెక్టర్లకు అవకాశం లభించనుంది. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలు పెడితే తూర్పుగోదావరి జిల్లా ఏడోది అవుతుంది.అందువల్ల మంగళవారమే కలెక్టర్ ప్రశాంతికి అవకాశం లభించవచ్చు. ఇంకా కొత్తగా రేషన్‌కార్డులు, పింఛన్లు, రోడ్లు, పెండింగ్ బిల్లుల మీద కూడా నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. కలెక్టర్ ప్రశాంతి ప్రజలకు ఉపయోగపడే పలు అంశాలపై కూడా ప్రజంటేషన్ చేసే అవకాశం ఉంది.

## పీజీఆర్ఎస్‌లో 211 అర్జీలు స్వీకరణ


కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు వింటున్న జేసీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య ప్రజల నుంచి 211 అర్జీలను అధికారులు స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. వచ్చిన అర్జీ మళ్లీ తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### 29 అర్జీలు స్వీకరించిన ఎస్పీ

పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి వాటికి చట్టపరిధిలో పరిష్కారం చూపించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వివిధ సమస్యలపై 29 ఫిర్యాదులను స్వీకరించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏవీ.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ నరసింహ కిశోర్

## పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తా
### పొగాకు కొనుగోళ్ల ప్రారంభంలో ఈడీ విశ్వశ్రీ

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉంటాయని పొగాకుబోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ.విశ్వశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. దేవరపల్లి,గోపాలపురం పొగాకు వేలం కేంద్రాలను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసి తగిన గిట్టుబాటు ధర సాధించుకోవాలన్నారు.ఇతర దేశాల్లో ఏర్పడిన కొరత కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మన పొగాకుకు మంచి డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర లభిస్తుందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.తొలిరోజు సోమవారం పొగాకు బోర్డుకు చెరుకుమిల్లి, కాటవరం గ్రామాల నుంచి 27 బేళ్లు వేలానికి పెట్టారు. ఎన్ఎల్ఎస్ పొగాకుకు కిలో రూ.290 ధర పలికింది. ఎస్‌బీఎస్ పొగాకు కిలో రూ.280 ధర పలికింది. పొగాకురైతులు కరుటూరి శ్రీనివాస్, కాట్రు వీరవెంకట సత్య నారాయణ,పరిమి శ్రీరామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రారంభంలో రూ.290లు ధర ఇచ్చారని రైతులకు గిట్టుబాటు కాదన్నారు. మహిళా రైతు కరుటూరి ఉషారాణి మాట్లాడుతూ గతేడాది ప్రారంభంలో కేజీ రూ.240..చివరిలో కేజీ రూ. 420 ధర పలికిందని...అలా కాకుండా ప్రారం భం నుంచి చివరి దశ వరకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు.అనంతరం ఈడీని మహిళా రైతులు సత్కరించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆర్ఎం జీఎల్‌కే.ప్రసాద్, ఏఎస్ హేమస్మిత, వేలం నిర్వహణాధికారి శ్యామ్ రైతులు సుంకవల్లి శ్రీనివాసరావు, బిక్కిన నాగరాజు, నరహరశెట్టి రాజేంద్రబాబు, యాగంటి సాయిబాబు, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, మాజీ రైతు సంఘం అధ్యక్షుడు మధుమోహన్, పరిమి జగదీష్ పాల్గొన్నారు.


దేవరపల్లిలో పొగాకు పరిశీలిస్తున్న ఈడీ విశ్వశ్రీ

# మామూళ్ల.. మత్తు మందు!
## డ్రగ్స్ అధికారుల ఎడిక్ట్!



- మామూళ్ల మత్తులో అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 3,500 షాపులు
- ఏడాదికి రూ.6 కోట్లు వసూళ్లు?
- ప్రతి దానికి ఒక రేటు నిర్ణయం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- 'ఆపరేషన్ గరుడ' అంతంతే
- కన్నెత్తి చూడని డ్రగ్స్ యంత్రాంగం
- ఇష్టానుసారం వ్యాపారుల దోపిడీ
- మోసపోతున్న వినియోగదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఔషధ నియంత్రాధికారులు నిద్దరోతున్నారు.. చుట్టూ దోపిడీ జరుగుతున్నా ఏం తెలియనట్టే వ్యవహరిస్తున్నారు.కళ్లెదుట దోపిడీ సాగుతున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ మనకెందుకొచ్చిందని వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు రూ.5 కోట్లు పైనే మామూళ్ల వసూళ్లు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హడావుడిగా చేసిన తనిఖీలే అందుకు ఉదాహరణ.. 16 షాపుల్లో తనిఖీలు చేసి కేవలం 11 చిన్న కేసులే నమోదు చేశారు. ఉన్నతాధికారులకు తూతూ మంత్రపు నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు.

### మందుల ధరల బాదుడే..

ప్రస్తుతం మనిషికి ఔషధం అనేది నిత్యావసరం. ప్రతి ఇంటిలోనూ నెలకు వచ్చిన ఆదాయంలో సుమారు పది నుంచి 50 శాతం మందులకు ఖర్చు చేస్తున్నారంటే ఏమేరకు అవసరాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా దోపిడీ మాత్రం ఆగడం లేదు. నిత్యావసర మందుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అయినా అడిగేవాడులేడు. పట్టించుకునేవారు అసలే లేరు.. మందులు ఎంత అంటే అంత పెట్టి కొనాల్సిందే. మెడికల్ షాపుల్లో నకిలీ మందులు ఇబ్బడి ముబ్బడిగా ఉంటున్నా ఇటీవల చేసిన తనిఖీల్లో ఒక్కటీ పట్టుకోలేకపోవడం కొసమెరుపు. మరోవైపు మందుల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నా అడిగే నాథుడు లేడు. బీపీకి వాడే ఇస్పిన్ 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కరోనాకు ముందు రూ.28 వరకూ ఉండేది. ప్రస్తుతం రూ.82 తీసుకుంటున్నారు. ఇలా అనేక రకాల మందుల ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. జనరిక్ మెడికల్ షాపుల్లోనూ అధిక ధరలకు అమ్మేస్తున్నా కనీస తనిఖీలు కానరావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ మందులు అమ్మేస్తున్నారు. ఇంకోవైపు మత్తు టాబ్లెట్ల వాడకం పెరిగినట్టు సమాచారం. మొన్న శనివారం చేసిన తనిఖీల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో ట్రమడాల్ ఇంజక్షన్లు ఉండాల్సిన స్టాకుకంటే తక్కువగా ఉండడమే ఉదాహరణ. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు.

### అధికారులేం చేయాలి..

ఉమ్మడి తూర్పుగోదావరి, కొవ్వూరు డివిజన్ పరిధి కలిపి రాజమహేంద్రవరంలోనే డ్రగ్స్ ఏడీ కార్యాలయం ఉంది. దీని పరిధిలో మెడికల్ షాపులు, ఏజెన్సీలు సుమారు 3,500 వరకూ ఉన్నాయి. అవి కాకుండా ఆసుపత్రుల్లో కూడా మెడికల్ షాపులు ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్‌లు చాలా ఉన్నాయి. జిల్లా ఔషధ నియంత్రాధికారి కార్యాలయంలో ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. ఎవరు ఏ మందులు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం అమ్ముతున్నారా అనేది పర్యవేక్షించాలి. కానీ సుమారు రెండేళ్లుగా ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం నుంచి సరైన సమాచారం ఉండడం లేదు. నెలవారీ ఎన్ని శాంపిల్స్ తీశారో.. ఎక్కడ కేసులు పెట్టారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే మామూళ్ల వసూళ్ల చేసుకుంటూ మత్తులో జోగుతున్నారు.. రూ.కోట్లు గడిస్తున్నారు. ప్రజలు మాత్రం పెద్దఎత్తున మోసపోతున్నారు.

### 16 షాపులు.. 11 కేసులు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే కారణంతో ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ గరుడ' పేరుతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్ ఈగల్, పోలీసు తదితర అధికారుల బృందాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16 షాపులపై దాడులు చేశారు. ఈ 16 షాపుల జాబితా ముందే సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో 8, కాకినాడ జిల్లాలో 4, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 దుకాణాలపై దాడులు చేశారు. తనిఖీల్లో పెద్ద కేసు లేమీ పెట్టలేదు. స్టాక్ రికార్డుకు.. స్టాక్‌కు మధ్య తేడా ఉన్నట్టు 11 చోట్ల నమోదు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్నారనే కారణంతో నాలుగు కేసులు నమోదు చేశారు. అనుమానం వల్ల మూడుచోట్ల శాంపిల్స్ తీసుకున్నారు. రెండుచోట్ల ట్రమడాల్ ట్యాబ్‌లెట్లు ఎవరికి విక్రయించారనే దానిపై ఆరా తీశారంతే. కానీ వీటి వివరాలేమీ అధికారికంగా డ్రగ్స్ ఏడీ ఆఫీసు చెప్పకపోవడం గమనార్హం. విజిలెన్స్ అధికారులు మాత్రం వివరాలిచ్చారు. మందుల షాపుల్లో జరుగుతున్న దందా ఏమైందో మరి.


రాజమండ్రిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత (ఫైల్)

### ప్రతీ దానికో రేటు..

ఎవరైనా మెడికల్‌షాపు పెట్టుకోవాలంటే పదో తరగతి చదివితే చాలు. నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలో మందులు అమ్మాలి. డిగ్రీ చదివితే ఒక ఏడాది అనుభవంచాలు. ఎంత పెద్దషాపు పెట్టాలన్నా కేవలం 3 వేలు చలానా కడితే చాలు. లైసెన్స్ ఇవ్వడానికి మామూళ్లు భారీగానే ఇవ్వాలి. ఇక ప్రతి దుకాణం నుంచి ఆరు నెలలకోసారి రూ.5 వేలు వంతున మామూళ్లు ఇవ్వాలి. ప్రతి ఏటా ఇన్‌స్పెక్షన్ పేరిట వస్తే ఒక్కో షాపు కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సిందే. ప్రతి షాపును ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఇది ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. కానీ దుకాణాన్ని బట్టి కనీసం రూ.25 వేల నుంచి మొదలవుతుంది. షాపు షిఫ్టింగ్‌కు రూ.15 వేల వంతున ఇవ్వాలి. ఇదంతా ఆయా ప్రాంతాల యూనియన్ నాయకులే స్వయంగా ఒక గుమస్తాతో వసూలు చేయిస్తారు. నెలకోసారో, వీలైనప్పుడో నేతలు స్వయంగా క్యాష్ బ్యాగ్ తీసుకుని వెళ్లి సదరు అధికారికి సమర్పించుకుంటారు. అక్కడి కొన్ని వాటాలు ఉంటాయి. ఇక్కడ కొందరు యూనియన్ నేతలు కూడా ఇష్టంలేని వారిపై దాడులు చేయిస్తారు. అప్పుడు అధికారులు వీరితో చేతులు కలుపుతారు. ఆరు నెలలకు దుకాణానికి రూ.5 వేల వంతున మొత్తం 3,500 దుకాణాల నుంచి రూ.1.75 కోట్ల మామూళ్లు వస్తాయని అంచనా. ఇన్‌స్పెక్షన్ పేరిట ఏడాదికి వసూలు చేసేది 3,500 దుకాణాల నుంచి రూ.3.50 కోట్లు. రెన్యూవల్‌కు ఐదేళ్లకోసారి రూ.5.25 కోట్లు వసూలు చేస్తారు. ఆకస్మిక తనిఖీలు, తప్పులు దొరికినప్పుడు వసూలు అదనం. ఆరు నెలల కిందట ఒక షాపు వద్ద డ్రగ్స్ దొరకడంతో భారీగా వసూలు చేసినట్టు ప్రచారం ఉంది.

## అయ్యో పాపం.. పది విద్యార్థులు
- రోజూ వందల సంఖ్యలో గైర్హాజరు
- గణితం పరీక్షకు 466 మంది డుమ్మా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అయ్యో ! ఏ కష్టమొచ్చిందో.. ఏ సమస్య దాపరించిందో..ఆ విద్యార్థులు పరీక్షలు రాయడంలేదు. పదవతరగతి పరీక్షలు ప్రతీ విద్యార్థి జీవితంలో కీలకం.ఏమైందో కానీ జిల్లాలో వందలాది మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు గైర్హాజరవుతున్నారు.అయినా వారి గురించి ఆరా తీసే వారే కరువయ్యారు.ఎందుకు పదవ తరగతి పబ్లిక్ పరీక్ష లు రాయలేపోతున్నారో ఒక్కరూ ఆరా తీయ డంలేదు. జిల్లాలో పదవ తరగతి పరీక్షకు 24,379 మంది విద్యార్థులు సిద్ధమయ్యారు. మొదటి రోజు జరిగిన తెలుగు పరీక్షకు ఏకంగా 461 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.ఇక 5వరోజు సోమ వారం జరిగిన మాథ్స్ పరీక్షకు ఏకంగా 466 మంది గైర్హాజరయ్యారు. 2వ రోజు జరిగిన హిందీ పరీక్షకు 377మంది హాజరు కాలేదు. 3వ రోజు జరిగిన ఇంగ్లీష పరీక్షకు 350 మంది,4వ రోజున జరిగిన సంస్కృతం పరీక్షకు 45 మంది గైర్హాజరయ్యారు.పదో తరగతి పరీక్షలను సాధారణంగా ఎవరూ ఎగ్గొట్టరు. కానీ ఇంతమంది విద్యార్థులు పది పరీక్షలకు ఎందుకు గైర్హాజరవు తున్నారో విద్యాశాఖ దృష్టి సారించాల్సి ఉంది.నూరుశాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.


కేన్సర్ వైద్య శిబిరం వద్ద ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## బలభద్రపురంలో కేన్సర్‌పై ఆందోళన వద్దు
### ముగిసిన సర్వే - 38 మందికే కేన్సర్ అనుమానిత లక్షణాలు : కలెక్టర్

అనపర్తి,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బలభద్రపు రం గ్రామంలో రెండు రోజుల పాటు ఇంటింటా సర్వే పూర్తి చేసి..38 మంది కేన్సర్ అనుమానిత లక్షణాలున్నట్టు గుర్తించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.గ్రామంలో వైద్య శిబిరాలను సోమవారం మరోసారి సందర్శించి మాట్లాడారు. 17 మంది వైద్యాధికారులు 98 మంది వైద్య సిబ్బందితో 31 బృందాలు గ్రామంలో రెండు రోజులు జల్లెడ పట్టి 38 మందికి క్యాన్సర్ అనుమానిత లక్షణా లున్నట్టు గుర్తించారన్నారు.స్వతంత్ర హాస్పిటల్, జీఎస్ఎల్ ఆసుపత్రులకు చెందిన కేన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని గ్రామానికి తీసుకువచ్చి సోమవారం మధ్యాహ్నం వరకు పది మందికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించగా ఒక్కరికీ వ్యాధి నిర్ధారణ కాలేదన్నారు. గతంలో గ్రామంలో నిర్వహించిన ఇంటింటా సర్వేలో 32 మందికి కేన్సర్ నిర్ధారణ అయినట్టు గుర్తించామని వీరిలో 15 మందికి చికిత్స పూర్తి కాగా మరో 17 మంది చికిత్స పొందుతున్నారన్నారు. వచ్చే మూడు రోజులు గ్రామంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని అనంతరం వచ్చే కేసులను ఆసుపత్రులకు తరలించి పరీక్షలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు గ్రామంలోని ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయిస్తామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు.బలభద్రపురంలో క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు మూల కారణాలను అన్వేషించాలని అపుడే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు,ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కోఆర్డినేటర్ ప్రియాంక, డాక్టర్ రాజీవ్, ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత్, డాక్టర్ సుజాత, శ్యామల, ఒమీబాబా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు డోలా రోసా తదితరులు పాల్గొన్నారు.


**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792/2537782, మొబైల్ నెంబర్: 9324517291, ఇ-మెయిల్ ఐడి: ubin0817295@unionbankofindia.bank

APPENDIX-IV-A [See Proviso to Rule 8 (6)]
**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన**
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావలసిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 11.04.2025న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వు ధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

**ఇ-వేలం తేది & సమయం: 11.04.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు**
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

1 ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/తనఖాదారు(లు): (1) M/s. కృష్ణ సాయి ఎగ్జిమ్స్, మేనేజింగ్ పార్టనర్: శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, రిజిస్టర్డు ఆఫీస్: డి.నం. 38-4-26, T-1, 4వ అంతస్తు, సత్య సాయి రెసిడెన్సీ, తిలక్ వీధి, కాకినాడ -533 001. (2) శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, తండ్రి: సూర్యనారాయణ శర్మ (లేటు), మేనేజింగ్ పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (3) శ్రీమతి ఐచ్చు అరుణ, భర్త: సత్యనారాయణ, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (4) శ్రీమతి మూలా పద్మావతి భర్త: వికె అన్నపూర్ణేశ్వరరావు, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి, జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (5) శ్రీ అరిగెల నూకరాజు, తండ్రి: లచ్చన్న దొర, పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, డి.నెం.18-16-16, మంత్రిప్రగడవారి వీధి, సూర్యనారాయణపురం, కాకినాడ-533001. హామీదారులు:(1) శ్రీ మూలా వెంకట కృష్ణ అన్నపూర్ణేశ్వరరావు, తండ్రి: సూర్యనారాయణ శర్మ (లేటు) మేనేజింగ్ పార్టనర్: మెస్సర్స్ కృష్ణ సాయి ఎగ్జిమ్స్, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ-533002, (2) శ్రీమతి ఐచ్చు అరుణ, భర్త: సత్యనారాయణ, చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (3) శ్రీమతి మూలా పద్మావతి, భర్త: వికె అన్నపూర్ణేశ్వరరావు, చిరునామా: డి. నెం. 51-10-37, పూరంవారి వీధి జగన్నాయక్‌పూర్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా-533002, (4) శ్రీ అరిగెల నూకరాజు, తండ్రి: లచ్చన్న దొర, డి.నెం.18-16-16, మంత్రిప్రగడవారి వీధి, సూర్యనారాయణపురం, కాకినాడ-533001, (5) శ్రీ ఐచ్చు సత్యనారాయణ, తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), చిరునామా: ఫ్లాట్ నెం.FF2, 4వ అంతస్తు, మానస అనిరుధ్ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్ నగర్ పోస్ట్ ఆఫీస్ ఎదురుగా, కాకినాడ-533 003, (6). శ్రీ ఐచ్చు నాగరాజు, తండ్రి: వెంకటేశ్వర్లు (లేటు), చిరునామా: డి.నెం. 51-10-2, పూరంవారి స్ట్రీట్, జగన్నాయక్‌పూర్, కాకినాడ-533002, (7). శ్రీ ముమ్మిడివరపు బాలమురళీ కృష్ణ, తండ్రి: వి.వి. సత్యనారాయణ, డి.నెం.81-24-12, శ్రీ వెంకటేశ్వరనగర్, ప్రకాష్ నగర్, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా-533106, (8). శ్రీమతి చేకూరి ఉషా దేవి, భర్త: శ్రీరామ మూర్తి, చిరునామా: డి.నెం. 5-123/C, శ్రీ సాయి గణేష్ గార్డెన్స్, వివేకానంద సెంటర్, అచ్చంపేట జంక్షన్, తిమ్మాపురం (పోస్టు), కాకినాడ-533 005. బకాయి మొత్తం: 28.02.2025 నాటికి రూ. 7,82,74,800.88/- (అక్షరాల ఏడు కోట్ల ఎనభై రెండు లక్షల డెబ్బై నాలుగు వేల ఎనిమిది వందల రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

**అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ ఆస్తుల వివరములు**
తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి రూరల్ మండలం, ధవళేశ్వరం గ్రామము, కేశవరం రోడ్, పొట్టి శ్రీ రాములు నగర్, బ్లాక్ నెం. 18, ఎల్‌పి.నెం. 127/88, నవీన డి.నెం. 4-341/53, ఆర్.ఎస్.నెం. 342/2, ఫ్లాట్ నెం. 10, మొత్తం 251 చ॥గ॥ విస్తీర్ణంలో రెసిడెన్షియల్ ఖాళీ భూమి ముమ్మిడివరపు బాల మురళీ కృష్ణ పేరున గలవు. హద్దులు: తూర్పు: ఇతరుల భూమి, పశ్చిమం: రోడ్డు, ఉత్తరం: పొరుగు స్థలం, దక్షిణం: ఫ్లాట్ నెం. 11. (సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం. 4171/2004 తేది. 30.12.2004)

రిజర్వు ధర: రూ. 23,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,35,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 24,000/-

బ్యాంకుకు తెలిసినంతవరకు ఆస్తిపై ఎటువంటి తాకట్టు ఋణభారాలు లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింక్‌ను దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 15.03.2025, స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## ఇసుక తవ్వకాలను అరికట్టాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు, డ్రెడ్జింగ్ పనులను అరికట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఏవో కె.రవివిక్రమ్‌కు వినతిపత్రం అందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ , జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ ఎం. ఆంజనేయులు, టీ. విజయవాణి, పట్టణ


కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, టి.ప్రసాద్, ఇ. రామకృష్ణ, సునీత, శ్రీనివాస్, ఏ. సత్యనారాయణ, విజయభాస్కర్, కె. రత్నసాయి పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరినీ ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణదారులకు అదనపు ఆర్థిక సాయంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నియోజకవర్గంలో 771 మంది లబ్ధిదారులకు రూ. 1.79 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, హౌసింగ్ పీడీ పీ. భాస్కరరెడ్డి, ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్. సుభాషిణి, హౌసింగ్ ఈఈ ఎస్. చంద్రశేఖర్, డిఈ శేఖర్‌బాబు, ఏఈలు డీఎస్ చాంబర్లిన్, కేఎస్ చక్రవర్తి, పి. సుబ్బరాజు , తదితరులు పాల్గొన్నారు.

## ఓటును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఫారం - 8 మైగ్రేషన్ ద్వారా నివాసముంటున్న ప్రాంతానికి సులభంగా ఓటును ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చునని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో కొత్త ఓటు నమోదుతో పాటు చేర్పులు, మార్పులు, ఓటు ట్రాన్స్‌ఫర్‌లు ఆన్‌లైన్ ఎప్పుడైనా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో


అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్

జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, ఎన్నికల డీటీ ఎం. నిరంజన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## తక్షణమే తాగునీరందించాలి


ఎంపీడీవోకి వినతిపత్రమిస్తున్న కాలనీవాసులు, తదితరులు

దేవరపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీలో తక్షణమే తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆ కాలనీ వాసులు, వివిధ కార్మిక సంఘ నాయకులు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డికి, తహశీల్దార్ శ్రీనివాస్, తహశీల్దార్ రవికిషోర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన అడపా సూర్యారావు, సీపీఎం నాయకులు ఎస్.భగత్, ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాలనీలో బోరు ఉన్నప్పటికీ అది తాగటానికి ఆమోదయోగ్యంగా లేదన్నారు. అలాగే మోటార్‌బోరు వేసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ కనెక్షన్ ఇవ్వలేదన్నారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవికిషోర్ మాట్లాడుతూ కాలనీ వాసులకు తక్షణమే తాగునీరు అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కే.రత్నాజీ, పిన్నమనేని సత్యనారాయణ, అయినపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పాలంగి గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలివేస్తామని ఏపీఈపీడిసిఎల్ ఈఈ ఎస్. అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

# డబుల్ అసెస్‌మెంట్లు రీవెరిఫికేషన్ చేయాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపల్ అత్యవసర సమావేశం సోమవారం చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ అసెస్‌మెంట్లన్నీ రీవెరిఫికేషన్ చేసి తదుపరి సమావేశానికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం ఈ అంశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. తర్వాత కౌన్సిలర్లు సమయపాలన పాటించకపోవడంపై బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి కొందరు కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ 3-54 గంటలకు


మాట్లాడుతున్న రత్నకుమారి

రావడమేంటని ప్రశ్నించారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ కాంపాక్టర్‌లు పాడైనందున చెత్త సేకరణకు తీసుకున్న ట్రాక్టర్ల అద్దెను తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ రూ. 3.98 కోట్ల డిమాండ్‌కు గాను ఇప్పటివరకు రూ. 3.24 కోట్లు వసూలు చేశామని, ఈ నెల 28వ తేదీ నాటికి మిగిలింది వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో డబుల్ అసెస్‌మెంట్లు తొలగించడానికి పెట్టిన అంశాన్ని రీ వెరిఫికేషన్ చేయాలని కంటమణి రమేష్‌బాబు కోరారు. 9191 మంది మహిళలు ఏకకాలంలో ఈ బిజినెస్‌లో పాల్గొనడం, మెప్మా ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలకు ఉపాధి కల్పించడంపై ఈనెల 8వ తేదీన మెప్మాకు గిన్నిస్‌బుక్‌లో స్థానం కల్పిస్తూ సర్టిఫికెట్‌లు అందజేయడంపై మెప్మా సిబ్బందిని చైర్‌పర్సన్ రత్నకుమారి, వైస్ చైర్మన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, కౌన్సిలర్లు, తదితరులు అభినందించారు.

## నేడు చాగల్లు మండల సమావేశం

చాగల్లు, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): చాగల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగు తుందని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ వీరాస్వామి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజాసమస్యలపై చర్చించాలని ఆయన కోరారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పిడి రాజు అన్నారు. సోమవారం రాజును డివిజన్ పరిధిలోని సంక్షేమ, విద్యా సహాయకులు అభినందించారు. కొవ్వూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మేరీమాత, జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ బాబీ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్ కె. సుధాకర్, ఎం. ఉదయ్‌కిరణ్, పి. భాస్కర్, డి.శివకుమార్, కె. వంశీ, బి. దుర్గ పాల్గొన్నారు.

## పాలంగిలో టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

ఉండ్రాజవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాలంగిలో టీడీపీ క్రియాశీలక సభ్యత్వ కార్డులను సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈద్పుగంటి ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. టీడీపీ బూత్ ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐషర్ వ్యాన్ బోల్తా

గోపాలపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కూల్‌డ్రింక్ లోడుతో వైజాగ్ వెళ్తున్న ఐషర్ వ్యాన్ అదుపుతప్పి గోపాలపురంలోని బార్బర్ షాపుపై సోమవారం బోల్తాపడింది. అయితే ఆ సమయంలో షాపు మూసి ఉండటంతో పెనుప్రమాదం తప్పినట్టయ్యింది. డ్రైవర్ వ్యాన్ నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. పరిసర ప్రాంతాల వారు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు.

## జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణ చేయాలి

నల్లజర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2026లో జరగబోయే జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎస్సీ వర్గకరణ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు పిల్లి కాంతారావు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గుడె వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. నల్లజర్ల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నందు సోమవారం విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. కోశాధికారి గుడే శ్రీనివాస్, కార్యదర్శి వడ్డే శ్రీను,ఉపాధ్యక్షులు అందుగుల వెంకటేశ్వరరావు,కోటా ఏలేశ్వరరావు,కూరపాటి నాగరాజు,సాయి, కాగి వెంకటేశ్వరరావు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

## బాధితులకు సరుకుల అందజేత


దూబచర్లలో అందిస్తున్న సువర్ణరాజు

నల్లజర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల వసంత కాలనీలో ఇల్లు కాలిపోయిన బాధితులు వంజరపు సన్యాసమ్మ, బైరవపాటి వెంకటేశ్వరరావు కుటుంబాలకు సీనియర్ నాయకులు పూరెళ్ల సత్యనారాయణ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు శివకాల సురేష్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ. 8 వేలు, బియ్యం బస్తా, నిత్యవసర సరుకులను గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు చేతులమీదుగా సోమవారం అందించారు. కార్యక్రమంలో మండల నాయకులు గుడిసె శివకృష్ణ,రుద్ర శ్రీను,కవులూరు సత్తిబాబు,కొత్తపల్లి హరిబాబు,సౌజన్య,జీ.వరుణ్‌కుమార్,తలంశెట్టి శ్రీనివాసరావు,ఉన్నమట్ల రమేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## గజ్జరం డీసీఎం హాస్టల్ తనిఖీ

తాళ్లపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): గజ్జరంలోని డీసీఎం హాస్టల్‌ను ఆర్డీవో రాణీ సుస్మిత సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు కల్పించే వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్ధార్ మోహనభారతి, ఆర్ఐ రామకృష్ణ రెవెన్యూ సిబ్బంది, హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

## అర్జీలను పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీసుస్మిత

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ పీజీఆర్ఎస్‌లో 17 ఫిర్యాదులు స్వీకరించినట్టు కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని నిర్ణీత కాలవ్యవవధిలో పరిష్కరించి, దరఖాస్తుదారునికి సత్వర న్యాయం అందించాలన్నారు. ప్రతి మండలంలో తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలకు బోర్లు మంజూరు

తాళ్లపూడి, మార్చి23 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు ముందుగా తీసుకున్న నిర్ణయాలతో పలుగ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు తీరనున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో జడ్పీ ద్వారా మంజూరైన బోర్లు వేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యహస్ తెలిపారు.

## వెంకన్నస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ఆలయంలో యాగం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, దంపతులు

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న శ్రీరాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజూ కొనసాగాయి. సోమవారం ఆలయ అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యుల పర్యవేక్షణలో ఆలయకమిటీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు దంపతుల పీటలపై కూర్చుని యాగం నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులకు గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. వేదపండితులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## 'పది' పరీక్షకు 21 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో సోమవారం నిర్వహించిన పదోతరగతి మ్యాథ్‌మెటిక్స్ పరీక్షకు 21 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాల్లో 1271 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 1250 మంది హాజరయ్యారు. అలాగే కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో 76కి 70, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంటు హైస్కూల్) 134 కి 132, ఏఎన్‌జడ్పీ గరల్స్ హైస్కూల్‌లో 109 కి 109, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95 కి 93, అభ్యాస పాఠశాలలో 130 కి 130, వేములూరు దీప్తి హైస్కూల్‌లో 144 మందికి 139, భాష్యం పాఠశాలలో 144 కి 139, జడ్పీ హెచ్ఎస్, కుమారదేవంలో 118 కి 118, జడ్పీ హెచ్ఎస్, వాడపల్లిలో 213 కి 212, జడ్పీహెచ్ఎస్, పంగిడిలో 108 కి 108 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## ఇసుకను తొలగిస్తున్నారు

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన


రోడ్లపై ఉన్న ఇసుకను తీస్తున్న సిబ్బంది

తాళ్లపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణా వాహనదారుల నిర్లక్ష్యంతో ఆర్ అండ్ బీ రోడ్లపై పడిన ఇసుకతో ప్రమాదభరితంగా మారడంతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి ఇసుకను తొలగించే పనులు చేపట్టారు. ఎక్కడైనా లారీలు లేదా ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసే టార్పాలిన్ కచ్చితంగా కప్పాలని, ఒకవేళ అలా చేయనట్టయితే కేసులు నమోదు చేస్తామని ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

పెరవలి, మార్చి24 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అన్నవరప్పాడు వద్ద సోమవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి... పిట్లవేమవరానికి చెందిన మాకా సురేష్ (26), నేతల హనుమంతు (26) ఉదయం చికెన్ కోసమని అన్నవరప్పాడు వెళ్లి తిరిగి స్వగ్రామం మోటారు సైకిల్‌పై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రావులపాలెం నుంచి తణుకు వైపు వెలుతున్న మారుతీ కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతును ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## కవి నేలపూరి రత్నాజీకి సన్మానం


రత్నాజీని సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

చాగల్లు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చాగల్లుకు చెందిన కవి నేలపూరి రత్నాజీని ఆదివారం రాజమహేంద్రవరం ఆనం రోటరీ క్లబ్‌లో ఆదివారం జరిగిన బోయి భీమన్న సాహిత్యం, ఉగాది ప్రత్యేక సభలో సన్మానించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తి మండ ప్రతాప్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈయన ఉద్దానం కిడ్నీ బాధితుల మీద రాసిన కవితకు జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి లభించింది. దాంతో పాటు పలు అవార్డులను పొందారు. బహుజన రచయితల వేదిక రాష్ట్ర కన్వీనర్ తంగిరాల సోనీ, నాగార్జున యూని వర్శిటీ ప్రొఫెసర్ ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి, అంబేడ్కర్ సాహిత్య వేదిక అధ్యక్షుడు కవి కోలాటి పెదిరాజు, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ వారా రాజు, తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## హోంమంత్రి అనితకు జన్మదిన శుభాకాంక్షలు

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు కొవ్వూరు టీడీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.సోమవారం పాయకరావుపేటలో ఆమెను కలిసి మొక్కను అందించారు. నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, దాయన రామకృష్ణ, కంటమణి నారాయనర, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, కురుకూరి శివ రామకృష్ణ, తదితరులు వెళ్లారు.


అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న కొవ్వూరు టీడీపీ నాయకులు

## అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఉన్నత విద్యాశాఖ రీజనల్ జేడీ డాక్టర్ శోభారాణి

నిడదవోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు విద్యాబోధన, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధానమంత్రి యువజన అభయాన్ పథకం ద్వారా రూ.3.60 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఉన్నత విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో రూ.3.60 కోట్లతో గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర, అధ్యాపకుల కృషి ఫలితంగా ఈ కళాశాలకు నాక్ బీప్లస్‌ప్లస్ గ్రేడ్ రావడం జరిగిందన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ కళాశాలలో ఉత్తమ విద్యా బోధన అందిస్తూ రోజు రోజుకి అడ్మిషన్లు పెంపొందించుకొంటూ కళాశాల అభివృద్ధి చెందుతుందన్నారు. కౌన్సిలర్ ఎండీ షకీరా బేగం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే ఉన్నత విద్య ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## కిటకిటలాడిన మేరీమాత ఆలయం

దేవరపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం మేరీమాత ఆలయం మూడో రోజైన సోమవారం భక్తులతో కిటకిటలాడింది. పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు దివ్యబలిపూజలు,, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు దివ్యబలిపూజలు చేశారు. భక్తులనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సకల మానవాళి సుఖసాంతులతో జీవించాలన్నారు. ఉదయం రెవరెండ్ ఫాదర్ దానియేలు, మేత్రాసన నూతన గురువులు మరియజోజి, బాలరాజు, సాగర్, దివ్యబలి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సువార్త కమిటీ గాబ్రియేలు సువార్త ప్రచారం చేశారు. గోరంట్ల జ్యానేస్, బాబుజార్జి, టీ.ఇమ్మానియేలు, కే.రాయప్ప, పరిశుద్ధ జపమాల, దివ్యబలిపూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్మల స్కూల్ బాలబాలికలచే నృత్యప్రదర్శన, కే.జ్ఞానానందం సంగీతకచేరి, ఏసుమహిమ నాటకాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు వ,ఇక, మేరీమాతను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నదాన ట్రస్ట్ కాంట్రాక్టర్ కల్లే నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

## పెండింగ్ బిల్లుల చెల్లింపుపై హర్షం

తాళ్లపూడి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల బకాయిలకు సంబంధించి పీఎఫ్, మెడికల్, జనరల్ బీమా వంటి బిల్స్ బకాయిలు రూ. 6,200 కోట్లను విడుదల చేయటంపై ఏపీ జేఏసీ చైర్మన్ జోడాల వె ంకటేశ్వరరావు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. కాగా పెన్షనర్స్‌కు రావాల్సిన బెనిఫిట్స్, పాత బకాయిల చెల్లింపులపై సీఎం చంద్రబాబు వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే పీఆర్‌సీ కమిషన్ చైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

పెరవలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అజ్జరం గ్రామానికి చెందిన పెచ్చెట్టి కోటేశ్వరరావును తూర్పుగోదావరి జిల్లా ఓబీసీ సెల్ విభాగం అధ్యక్షుడిగా నియమించినట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీవీ విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టీ కే విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ కృతజ్ఞతలు తెలిపారు.

## లక్ష తులసీ దళ పూజ

పెరవలి, మార్చి24(ఆంధ్రజ్యోతి): కాకరపర్రులో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో సోమవారం లక్ష తులసీ దళ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు గావించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పెన్మత్సన సుబ్రహ్మణ్యవర్మ కుటుంబసభ్యులు ఈ సందర్భంగా హోమాలు, తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని పలువురు భక్తులు, తదితరులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## బాబా ఆలయంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చాగల్లు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణగూడెం షిరిడీ సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏడో వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

నిడదవోలు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సహిత సోమేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో మంగళవారం నుంచి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సోమాల శివ, ప్రధాన అర్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి తెలిపారు. విశేష పూజలతో ప్రారంభించి స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం, 26న రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, గ్రామోత్సవం, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణాలు, 27న స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, 28న మాసశివరాత్రి విశేష అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, 29న వసంతోత్సవం, పుష్పయాగోత్సవం, పవళింపుసేవ నిర్వహించనున్నట్టు ఈవో , ప్రధాన అర్చకుడు తెలిపారు. ప్రతిరోజు సాయంకాలం పొన్నా కృష్ణబాబు శర్మచే శివపురాణం ప్రవచనాలు ఉంటాయన్నారు.

## రక్షిత నీటి ట్యాంకులకు లిక్విడ్ క్లోరినేషన్ యంత్రాలు


గోపాలపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సరఫరా చేస్తున్న రక్షిత నీటి ట్యాంకులకు లిక్విడ్ క్లోరినేషన్ చేసేందుకు యంత్రాలను అమర్చినట్టు పంచాయతీ కార్యదర్శి పీ.అనురాధ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గోపాలపురం పట్టణంలో మొత్తం ఐదు రక్షిత నీటిసరఫరా ట్యాంకులున్నాయన్నారు. ఒక్కో ట్యాంకుకు రూ. 32 వేలతో లిక్విడ్ క్లోరినేషన్ యంత్రాలను అమర్చామ న్నారు. ఐదు ట్యాంకులకు సుమారు రూ.లక్షా 60వేలు వెచ్చించినట్టు ఆమె తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద పీ4పై గ్రామ సభ నిర్వహించారు.

కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

## వాట్సప్‌లో స్టేటస్ పెట్టి... గోదాట్లో దూకేశాడు

కొవ్వూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి వ్యక్తి మృతి చెందినట్టు పట్టణ సీఐ పీ. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ... నందమూరుకి చెందిన కోడిగుడ్ల వ్యాపారి కలివరపు చాణక్య (36) స్థానిక ఇందిరమ్మకాలనీలోనివాసముంటున్నాడు. చిన్నతనం నుంచి (బై పోలార్) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం తన ఎక్సెస్ బండిపై ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు కం రైలు బ్రిడ్జిపైకి చేరుకుని తన మొబైల్ వాట్సప్‌లో మానసిక వ్యాధిని తట్టుకోలేక గోదావరిలో దూకి చనిపోతున్నాని స్టేటస్ పెట్టుకున్నాడు. ఆ స్టేటస్‌ను భార్య చూసి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీంతో చాణక్య సోదరుడు పట్టణ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో గోదావరి నదిలో గాలింపు చర్యలు చేపట్టగా, రోడ్డు కం రైలు బ్రిడ్జి దిగువన ఎరినమ్మఘాట్‌లో చాణక్య మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. చాణక్యకు భార్య బేబి సరోజిని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు సురేష్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## అపూర్వ కలయిక


కార్యక్రమంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నల్లజర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి హైస్కూల్‌లో 2007 - 08వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. నాడు బోధించిన ఉపాధ్యాయులను గౌరవించి సత్కరించారు. నాటి జ్ఞాపకాలతో రోజంతా కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఉల్లాసంగా గడిపారు. తనతో చదువుకుని ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న భవాని, సురేంద్ర, టీసీఎస్‌లో పనిచేస్తున్న రామిశెట్టి నాగదేవి, చుండ్రు అయ్యప్ప, పోలీస్ శాఖలో గన్‌మెన్‌గా పనిచేస్తున్న బూసనబోయిన ఏడుకొండలు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## పెట్రోల్ బంకులో తనిఖీలు

దేవరపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి - గోపాలపురం రోడ్డులోని పెట్రోల్ బంకులో ఆదివారం కొంతమంది స్థానికులు వెళ్లి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, సీఎస్ డీటీ సత్యనారాయణ బంకును తనిఖీ చేశారు. ఈ సందరంగా వారిద్దరు మాట్లాడుతూ బంకుల్లో ఏమైనా తేడా ఉన్నట్టు వినియోగదారులు భావిస్తే ముందుగా రెవెన్యూఅధికారులు, ఆర్డీవోకి తెలపాలన్నారు.

## బంగారం వస్తువుల చోరీ

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి 8 కాసుల బంగారం, ఐదు కిలోల వెండి వస్తువులు దొంగిలించుకుపోయినట్టు కొవ్వూరు రూరల్ హెచ్‌సీ ఆర్.భగవాన్‌దాస్ తెలిపారు. పశివేదలకి చెందిని పావులూరి రమాసుందరి కుమారుడు గ్రామంలోని శివాలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు.